ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి. వి. ఎల్. ఎన్. రాజు

సంపుటి : 30 | సంచిక : 11 | జూలై 2025

**రమణ భాస్కర**

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 32

గౌరవ సంపాదకులు

శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)

**చందా**

సంవత్సర చందా:రు॥ 150/-

విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా

**రమణ భాస్కర**

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు – 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు – 534 265

9441122622

7780639977

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747

డిజైనింగ్

అనన్య జిరాక్స్ & నెట్ సెంటర్

(నందిగామ శేషసాయి)

పి. పి. రోడ్డు, లజపతిరాయ్ పేట,

పాలకొల్లు, 9397151342

## ఈ సంచికలో. . . .

గురువే సర్వస్వం – అంతా గురువే................ 2

సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు ....... 7

మన గురువు ఎవరు? ............................ 28

గురువు........................................... 30

**ఇతర విషయములు :**

చావలి సూర్యనారాయణమూర్తి గారి వ్యాసం



గురువు డిక్షనరీలో అసాధ్యం అంటూ ఏమీ లేదు. నువ్వు వంద జన్మలలో అనుభవించవలసిన ప్రారబ్ధాన్ని, అవసరమైతే ఒక్క జన్మలో ఆ ప్రారబ్ధం అనుభవింప చేసి నీకు ఆత్మజ్ఞానాన్ని ప్రసాదిస్తాడు. వాడు గురువు.

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

# గురువే సర్వస్వం - అంతా గురువే

(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణముల నుండి సేకరణ)

మన గురుదేవులు, ప్రేమస్వరూపులైన శ్రీ నాన్నగారు గురువు యొక్క వైభవం, గురువు అంతస్తు గురించి, గురువుని ప్రేమించి మనము బాగుపడాలని మనపై కరుణతో ఎన్నో విధాలుగా మనకి చెప్పేవారు. ఆయనపై విశ్వాసమే మనము తరించే మార్గము.

## గురువు అంతర్యామి

మనలో అంతర్యామిగా ఉండి మన లోపల ఉన్న బలహీనతలని చూపించేవాడు గురువు. ఆ బలహీనతలను తొలగించుకోవటానికి ప్రయత్నం చేయమని చెప్పి, వాటిని తొలగించుకోవటానికి శక్తిని ఇచ్చేవాడు గురువు. వాటిని బయటికి లాగి మంట పెట్టేవాడు గురువు. అంతా గురువే. అంతా ఆయనే చూసుకుంటాడు. నిజమైన జ్ఞానోదయం మనకి ఆశీర్వదిస్తాడు. ఆయనే భగవంతుడు.

భక్తి వల్ల మాత్రమే భగవంతుడు తెలియబడతాడు. ఒక భక్తికే ఆ శక్తి ఉంది. భక్తి పరిపక్వతని బట్టి సాక్షాత్కరిస్తాడు. అంటే, ఈశ్వరుడు ఆత్మ రూపంలో మన హృదయంలోనే ఉన్నాడు. ఆత్మ రూపంలో ఉన్న ఈశ్వరుడు, మహా వెలుగు, మహా కాంతి, మహా శాంతి, మహా జ్ఞాని. మన హృదయంలో ఉండి, మన మనస్సుని పక్వం చేసేవాడు ఆయనే, ఇంద్రియాలని మనస్సుని లోపలికి మళ్ళించేవాడు ఆయనే, మనల్ని ముగ్గేసేవాడు ఆయనే, తరువాత మనకి మెచ్యూరిటీ తీసుకొచ్చేవాడు ఆయనే! మనకి మెచ్యూరిటీ వచ్చాక, హృదయంలో ఉన్న ఈశ్వరుడు, మనకి ఎరుకలోకి వస్తాడు. అప్పుడు ఎక్కడో ఉన్నాడు అనుకున్నాము, ఇక్కడే ఉన్నాడు ఏమిటి, ఎప్పుడో తెలుస్తుంది అనుకున్నాము, ఇప్పుడే తెలిసింది అనుకుంటాము.

## గురువు మనని విడిచి ఉండడు

ఈ మధ్య మనకి గురువు దయ ఏమీ కనపడటంలేదు, దేవుని దయ ఏమీ లేదు, ఎటుచూసినా కష్టాలు వచ్చేస్తున్నాయి, మనస్సంతా పుండు అయిపోతోంది అని మనకు

అనిపిస్తుంది. మన గురువు మనని వదిలేసాడు, ఎప్పుడు చూసినా అశాంతి గానే ఉంటోంది, అని మధ్య మధ్యలో అనిపిస్తూ ఉంటుంది. మీకు అలా ఎందుకు అనిపిస్తుంది అంటే, మీ లోపల ఉన్న అశాంతిని, లోపల ఉన్న సంస్కారాలని కెలికి మీ బుద్ధికి తెలియజేసి, బయటికి లాగి, మంట పెట్టే వరకూ విడిచిపెట్టడు, లోపలి నుంచి పని చేస్తాడు, గురువు మిమ్మల్ని విడిచిపెట్టేసాడు అనుకోకండి.

ఈ దేహం చనిపోయాక మళ్ళీ మనం పునర్జన్మలోకి వెళ్తాము. ఏ జన్మలోకి వెళ్తామో మనకి తెలియదు. గురువు చూసుకుంటాడు, మళ్ళీ ఆ జన్మలోకి వస్తాడు. గురువుని మనం నువ్వు ఎవరవో నాకు తెలియదు అంటాము. ఆయనని మనం ప్రేమించము. ఆ కొత్తజన్మలో ఆయన మీద మనకి ప్రేమ కలిగేటట్టు చేసే బాధ్యత కూడా గురువే తీసుకుంటాడు. జన్మాంతరంలో మనకి అనుబంధం ఉంటేనే, జీవితం పొడుగునా ఆప్యాయత నిలబడుతుంది, ఆ స్నేహం నిలబడుతుంది. ఆ మాధుర్యం నిలబడుతుంది. ఆ స్వీట్‌నెస్‌ని కాపాడుకోవాలి అన్నాడు కాళిదాసు.

మనం చనిపోతున్నాము, తిరిగి పుడుతున్నాము. మన ప్రారబ్ధంలో ఏది ఉంటే అది అనుభవిస్తున్నాము. దేహము, మనస్సు, లోకము ఎంత నిజమో ఇవన్నీ అంతే నిజము. ఇవి వ్యవహారిక సత్యాలే కాని పారమార్థిక సత్యాలు కావు. మనం అజ్ఞానమనే నిద్రలో ఉన్నాము. ఈ అజ్ఞానమనే నిద్రలోనుంచి, ఈ అహంభావన అనే నిద్రలో నుంచి, వ్యక్తిభావన అనే నిద్రలో నుంచి మనల్ని మేలుకొలిపే వరకూ గురువు మనని వెంటాడుతూనే ఉంటాడు, వాడు గురువు.

## మన బలహీనతలు చూపించి వాటిని తొలిగిస్తాడు / గురువు అంటే మన సర్జన్

కిరసనాయిలు డబ్బాకి మూత తీయకుండా పెట్టుకుంటే వాసన అలాగే ఉంటుంది. మూత తీసేసి ఎండలో పెడితే వాసన పోతుంది. అవసరమైతే అలా మీ మనస్సుని ఎండబెడతాడు గురువు. అది మీమీద అయిష్టం కాదు, కోపమూ కాదు, ఇష్టం మీదే ఇదంతా చేస్తున్నాడు. గురువు యొక్క ఆగ్రహం కూడా అనుగ్రహమే అని గ్రహించినవాడు ధన్యుడు. ఎక్కడికైతే మిమ్మల్ని తీసుకెళ్ళాలి అనుకున్నాడో అక్కడికి మిమ్మల్ని సమాయత్తం

చేయటానికి గురువు చేసే పని అది. మనకి తెలియకుండా హృదయాంతరాళాలలో బలహీనతలు ఎక్కడ ఉన్నాయో, సరిగ్గా అక్కడ లైట్ వేసి చూపిస్తాడు. చూపించి విడిచిపెట్టేయడు, దానిని తొలిగించుకునే శక్తిని ఇస్తాడు, దానిని తొలిగించుకునే పరిస్థితులు కలగచేస్తాడు, ఒకోసారి తలుపు సందున పెట్టి నొక్కుతాడు. తడిగుడ్డని పిండినట్టు అవసరమైతే నీ లోపల బలహీనతని పిండి, దాన్ని తొలిగిస్తాడు, గురువంటే మన సర్జన్! మనని కంగారు పెట్టడు. సర్జరీ ఎప్పుడు చెయ్యాలి, ఎక్కడ చెయ్యాలి, ఎలా చెయ్యాలి, ఆ ప్రక్రియ అంతా ఆయనే చూసుకుంటాడు. ఆ ముహూర్తం కూడా ఆయనే పెట్టుకుంటాడు. ఆ సర్జరీ జరిగేటప్పుడు మీకు తెలియనివ్వడు. ఆ అనుభవం వచ్చేవరకు మీకు తెలియదు.

## గురువుకి అసాధ్యమనేది లేదు

మనం గురువుని నమ్ముకున్నాము అయినా ఏంటి ఇంత అశాంతి వస్తోంది, ఇంత గొడవని తీసుకొస్తున్నాడు అని ఒక్కోసారి మన గురువుని మనమే తిట్టేస్తాము. ఈమధ్యన కనపడటం లేదు, మనల్ని మరిచిపోయాడని అనుకుంటాము. మన తిట్లుకి ఆయన ఏమీ అనుకోడు, రియాక్ట్ అవ్వడు. అశాంతిగా ఉండి అలా తిట్టుకొంటున్నారు అని ఆయనకి తెలుసు. మన లోపల ఉన్న బలహీనతలు ఏంటో మనకి తెలియటానికి అలా దూరం వెళ్లిపోతాడు. మన బలహీనతలు మనకి తెలిసేవరకూ కొంతకాలం ఆగుతాడు. మీకు ఎవరి మీదైతే ప్రేమగా ఉందో, ఒకోసారి వాళ్ళ చేతే తిట్టిస్తాడు. అప్పుడు కాని వాళ్ళ మీద మోహం పోదు. మనలను ఈ శరీరానికి, లోకానికి, మనస్సుకి, బంధించే ఆధారాలు లోపల ఏవైతే ఉన్నాయో, మనం ఎటువంటి ఆధారాల మీద జీవిస్తున్నామో, వాటిని మనకు బాధ కలుగకుండా ఒకో ఆధారాన్ని ఊడగొట్టుకుంటూ వస్తాడు.

మనం జీవితంలో ఎవరి కోసమైతే కష్టపడుతున్నామో, చెమట పట్టేలా పనిచేస్తున్నామో, ఒకోసారి వాళ్ళే తిడతారు. అప్పుడు కాని వాళ్ళ మీద ఉన్న మమకారం మనకి పోదు. అది కూడా సాధనలో భాగమే. ఎవరికి ఏ ప్రక్రియ ద్వారా వాళ్లకి ఆపరేట్ చెయ్యాలో గురువు చూసుకుంటూ ఉంటాడు, అనుకరణ చేయడు. నీ బలహీనతలు చూసి వాటిని బయటికి ఎలా లాగాలో, దాన్ని ఎలా కాల్చాలో చూస్తాడు. వెయ్యి జన్మల నుండి పీడించే వాసనలని ఒక్క క్షణంలో ఆయన చూపు ద్వారా కాల్చేస్తాడు. గురువు దయ ఎలా ఉంటుందంటే, కోటి

జన్మల తరువాత కాని మనకి రాదు అనుకున్నది ఇప్పుడే వస్తుంది. గురువు దయ అట్టిది. వాడికి ఏదైనా సాధ్యమే.

## గురువుకి శరీరంతో పని లేదు / లోపల నుండి పని చేస్తాడు

మనం ఏదైనా పని చేయాలంటే దేహం ఉండాలి. గురువుకి దేహంతో పని లేదు. మన కోసం దేహం ధరించి వస్తాడు. వాడు సంకల్పించుకుంటే చాలు అంతా అయిపోతుంది. గురువు యొక్క దయ మహా ప్రవాహం. గురువుకి దేహం లేకపోయినా ఆయన ఒక్కసారి సంకల్పించుకుంటే గోదావరి నదికి వరద వచ్చినప్పుడు గడ్డిపరకలు ఎలా తేలికగా కొట్టుకుపోతాయో, అలా పెద్ద పెద్ద దుంగలలాంటి మీ బలహీనతలు, పునర్జన్మ హేతువులు అన్నీ ఆ జలప్రహావంలో గడ్డిపరకలు కొట్టుకుపోయినట్టు, గురువు అనుగ్రహంలో కొట్టుకుపోతాయి. మామిడిపండు దేవుడైతే – అంటే మామిడిపండు, పైన ఉన్న తొక్క, లోపల ఉన్న టెంక, రసము, పీచు ఇవన్నీ కలిపి దేవుడైతే, అందులో ఉన్న ఒక్క రసం మాత్రమే గురువు. అంటే ఎసెన్స్. మీ లోపల ఉన్న బలహీనతలు మీరు జ్ఞానం సంపాదించటానికి అడ్డు వచ్చేస్తూ ఉంటాయి. ఆ బలహీనతలను నీకు నొప్పి లేకుండా ఎలిమినేట్ చేస్తాడు. నీకు లోచూపు కలుగచేస్తాడు, హృదయగుహకి నువ్వు వెళ్ళేవరకూ నిన్ను తోలుకుంటూ పోతాడు.

## సన్మార్గంలో నడిపిస్తాడు / సురక్షిత మార్గంలో ఉంచుతాడు

గురువు లోపల నుంచి పని చేస్తూ ఉంటాడు. మిమ్మల్ని ఎక్కడికి తీసుకెళ్ళాలో ఆయన చూసుకుంటా ఉంటాడు. ఒకవేళ మధ్యలో దారి తప్పితే, దారి మళ్ళించి, మళ్ళీ తన వడిలోకి తీసుకుంటాడు. వివేకానంద అంతటివాడు కూడా ఒకసారి కొన్ని మహిమలకి ఆకర్షింప బడ్డాడు. అటు వెళ్ళటానికి సిద్ధం అయితే అందులోంచి మళ్లించిన వాడు రామకృష్ణుడు.

ఒకవేళ నువ్వు మహిమలు అనీ, గొడవలు అనీ ఇటువంటి ఆకర్షణలో పడి రాంగ్ డైరెక్షన్‌లోకి వెళ్లిపోతే నిన్ను విడిచిపెట్టడు, అదే పులి నోట్లో పడ్డ మాంసపు ముక్క. ఆయనని ప్రేమించటం మానేస్తావు అనుకో, గురువు వాడిమీద నీకు ప్రేమ కలిగేటట్టు చేసి, తన వైపు

నీ మనస్సుని ఆకర్షించుకుంటాడు. నువ్వు వెళ్ళే రాంగ్‌పాత్‌లో ఉన్న ప్రమాదాన్ని నీకు చూపించి నీ పాత్‌ని మారుస్తాడు. ఒకవేళ గురువు మీద నీకు ఆకర్షణ పోతుంది అనుకో, ఆయన మీద నీకు ఆకర్షణ కలిగేటట్లు చేసుకునేవాడు కూడా గురువే.

**గురువు కరుణామయుడు. ఏది చేసినా దయే!**

దూడకి పచ్చగడ్డి చూపిస్తే మన కూడా వచ్చేస్తుంది. అలాగే గురువు కూడా ఆయన దయని చూపిస్తూ హృదయగుహలోకి మిమ్మల్ని తోలుకొనిపోతాడు, నువ్వు ఎంత సాధన చేసినా, ఎంత ప్రయత్నం చేసినా, ఎన్ని నోములు వ్రతాలు చేసినా, చిట్కాలు చేసినా, గురువు దయ లేకుండా మీకు జ్ఞానం రాదు. గురువు దయ ఎలా ఉంటుంది అని భగవాన్‌ని అడిగితే గురువు దయ మాటలకి, తలంపులకి, ఊహలకి, మీ సంకల్పాలకి అందదు. అట్టిది గురువు దయ. అది ఎలా ఉండాలో అలా ఉంటుంది కాని, నువ్వు అనుకున్నట్టుగా అది ఉండదు. అది నోటితోటి చెప్పలేము, దాని గురించి రాయలేము. అసలు మన మాటకే కాదు మనస్సుకు కూడా అందదు. అది అనుభవైకవేద్యం. మనం మనస్సుకి ఏవో సపోర్ట్ లు పెట్టుకొని బ్రతుకుతున్నాము. మనస్సుకి సపోర్ట్ లు తీసేస్తేనే కాని మనస్సు వెళ్లి హృదయములో పడదు, అంటే అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడిలోకి వెళ్లి ఐక్యమవ్వదు. ఆ సపోర్టులు ఒక్కొక్కటి ఊడగొడతాడు, ఆ ఊడగొట్టేటప్పుడు మనకి బాధ లేకుండా కూడా చూసుకుంటాడు. ఒకవేళ ఎప్పుడైనా బాధని ఇచ్చినా మీరు భరించగలిగే బాధని ఇస్తాడు కాని భరించలేని బాధని ఇవ్వడు.

గురువు యొక్క మాట దయ, చూపు దయ, కదలిక దయ, గురువు యొక్క మౌనం దయ, అంతా దయే.

**గురువు మన దేహాన్ని చూడడు, మన మనస్సును చూడడు, మన బలహీనతలను చూడడు. గురువు హృదయంలో ఏదైతే ఉందో అదే మన హృదయంలోనూ ఉంది. డైరెక్ట్‌గా దానినే చూస్తూ ఉంటాడు, మన మనస్సును, ఇంద్రియాలను అటు తిప్పుతాడు, అన్నీ సమకూరుస్తాడు, మనకు తెలియకుండానే ఆత్మస్థితిలోనికి మేల్కొలుపుతాడు, వాడు గురువు.**



ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 27 ఫిబ్రవరి 1995, చించినాడ

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

పాల్ బ్రంటన్ ఇంగ్లండులో ఒక రచయిత. ఆయన వ్రాసిన పుస్తకం ఒక బెంగాలీ భక్తుడు చదివి అప్పటినుండి భగవాన్‌ను ఎప్పుడు చూద్దాము, ఎప్పుడు చూద్దాము అని అనుకొంటున్నాడు. చూసినవాడు, చూసేశాను అనుకొంటాడు. చూడనివాడు ఎప్పుడు చూడలేదు అని ఇంక ఎప్పుడు చూద్దాము అనుకొంటాడు, ఆలా అనుకోవటంలోనే మనస్సు పక్వానికి వస్తుంది. అరుణాచలం ఎప్పుడు చూడలేదు, ఎప్పుడు చూడలేదు, ఎప్పుడు చూస్తాం, ఎప్పుడు చూస్తాం అనుకున్నప్పుడు కూడా సాధన జరిగిపోతుంది. అలా అనుకునే వాళ్ళ మనసు ముగ్గిపోతూ ఉంటుంది. చూసిన వాడికి చూసి వచ్చేశాం అనిపిస్తుంది. ఆరుణాచలం చూడని వాడికి పాపం చూడలేదు ఎప్పుడు చూద్దాం అని ఆ తలంపు అరుణాచలం చుట్టూ తిరుగుతూ ఉంటుంది. అందుచేత వాడికి కూడా మనసు ప్రిపేర్ అవుతూ ఉంటుంది, మనసు పక్వానికి వస్తూ ఉంటుంది. ఎందుచేత అంటే లోపల వేదన జరుగుతుంది, లోపల పోరాటం జరుగుతుంది, అందుచేత వాడి మనసు కూడా ముగ్గుతూ ఉంటుంది. బెంగాలీ వాడు ఏమంటున్నాడు అంటే Paul Brunton పుస్తకం చదివి రమణమహర్షి గారిని ఎప్పుడు చూద్దామా, అని ఆత్రుత తోటి ఎంతోకాలం నుంచి మిమ్మల్ని చూడాలని అనుకుంటున్నాను. ఈనాటికి మిమ్మల్ని చూడటం జరిగింది అని పరిచయం మాటలు అయిన తరువాత వీడు ఏమంటున్నాడు అంటే కామాన్ని, క్రోధాన్ని, మోహన్ని అణచడం ఎలాగా అని అడుగుతున్నాడు. క్రోధం అనేది రాజు. ఒక దేశాన్ని నువ్వు జయించాలి అనుకున్నప్పుడు ముందు అక్కడ ప్రజలను జయించక్కర్లేదు అక్కడ రాజుని జయించేస్తే అక్కడ ప్రజలు అందరూ లొంగిపోతారు. అంతేకదా, ఒక దేశాన్ని మనం జయించాలి అనుకుంటున్నాం అనుకోండి ఆ దేశంలో ప్రజలు అందరినీ జయించక్కర్లేదు అదే విధంగా

మనలో ఉన్నటువంటి చెడ్డ లక్షణాలకి, చెడ్డ గుణాలకి రాజు కోపం. అందుచేత వాడిని పడగొట్టేస్తే మిగతా వాళ్ళు అందరూ పడిపోతారు అంటున్నాడు. దీనికోసం మానవజన్మ ఒక్కటే సరిపోదు. మానవజన్మ రావడం మంచిదే. అందరూ మనుషులే. కానీ అందరికీ మోక్షం సంపాదించాలి, జ్ఞాన సముపార్జన చెయ్యాలి అనే కాంక్ష కలగదు. ఒకవేళ ఆ కాంక్ష కలిగినా జ్ఞాన సముపార్జన కాంక్షను satisfy చేసే మహాత్ములు అటువంటి మహా పురుషులు, సత్పురుషులు, సహృదయం కలవారి సహవాసం నీకు దొరకడం ఇంకా కష్టం, ఇవి మూడు దొరికాయా ఏమి పట్టిందిరా నీకు దశ అన్నారు ఆచార్య స్వామివారు. ఎంతో పుణ్యాత్ముడు అయితేనే కానీ, నీకు ఎంతో దశ ఉంటేనే కానీ ఇవి మూడు నీకు పట్టవయ్యా అన్నాడు. ఇవి మూడు పట్టాలి. ఒకటి మానవజన్మ, మానవజన్మ వచ్చిందా ముముక్షుత్వం అందరికీ మోక్షం సంపాదించాలి అనే కాంక్ష రాదు. ఒకవేళ మోక్షం సంపాదించాలి అనే కాంక్ష వచ్చినప్పటికీ ఆ desire fulfil చేసే మహాత్ముడు నీకు దొరకడు. ఒకవేళ వాళ్ళు కూడా నీకు దొరికితే నీకు దశ వచ్చినట్టే అని ఆచార్యుల స్వామి వారు చెప్పారు. ఇక్కడ వీడు ఏమి అడుగుతున్నాడు అంటే కామాన్ని ఎలా అణచాలి, కోపాన్ని ఎలా అణచాలి, మోహాన్ని ఎలా అణచుకోవాలి. అవి arrise అవుతున్నాయి కదా, వాటిని ఎలా తొలగించుకోవాలి, ఎలా remove చెయ్యాలి? నువ్వు కోపం అంటున్నా, మోహం అంటున్నా, ఇంకోటి అంటున్నా వాటి మూలం తెలుసుకుంటే వాటిని పోగొట్టుకోవడం తేలిక అవుతుంది. అంటే రోగ కారణం తెలిస్తే రోగం నశిస్తుంది. రోగ కారణం తెలియకుండా రోగం నశించదు. అదే విధంగా desire ఎందుకు వస్తుందో నువ్వు అర్థం చేసుకుంటే, desire మూలం తెలుసుకుంటే అది నీకు తొలగిపోతుంది. అంటే చేతిలో ఉన్న ముద్ద నోట్లో పెట్టుకోవడం ఎంత తేలికో, రోగ కారణం తెలిశాక రోగం తగ్గిపోవడం అంత తేలిక. రోగ కారణం ఎప్పుడైతే తెలిసిందో, దానికి సంబంధించిన మందు ఉంటుంది అది వాడితే రోగం పోతుంది. అందుచేత మీకు ఏ రకమైన బలహీనత వస్తోందో, ఆ బలహీనత ఎక్కడ నుంచి వస్తోంది, ఎందుకు వస్తోంది అని విచారణ చేస్తే దాని మూలం తెలిస్తే ఆ బలహీనత పోతుంది. ఒకవేళ ఆ బలహీనతకి

నువ్వు మధ్యలో లొంగి పోతున్నప్పటికీ నువ్వు కంగారు పడకు. లేచి కూర్చో, ఎప్పుడైనా మనం కాలు జారి పడిపోతాము. కాలుజారి పడిపోయాం కదా ఇంక లేవము అంటే అర్థం ఏమిటి, అదే ఇక్కడ భగవాన్ చెప్పేది. మనం ఎక్కడైనా కాలు జారి పడిపోతాము అనుకోండి నేను పడిపోయాను ఇంక లేవను అంటే ఆ మాటకి అర్థం ఉందా అలాగే ఆ సంస్కారం చేతిలో, ఆ వాసన చేతిలో, ఆ తలంపు చేతిలో, ఎప్పుడైనా నువ్వు ఓడిపోతూ ఉండవచ్చు. Repeated గా ప్రయత్నం చెయ్యి, తిరిగి తిరిగి ప్రయత్నం చేస్తూ ఉండాలి. కృష్ణుడు ఏమన్నాడు అంటే నువ్వు కంగారు పడకు పరుగెత్తుకుని వెళ్ళక్కరలేదు, చేసే సాధన నెమ్మదిగానే చెయ్యి అన్నాడు. Slow గా చేస్తూ ఉంటే, steady గా చేస్తూ ఉంటే ఆ వాసన నీ చేతిలో చిక్కి శల్యం అవుతుంది, అలా Repeated గా నువ్వు సాధన చేస్తుంటే ఆ వాసన నశిస్తుంది. అందుచేత దాని మూలాన్ని కనుగొంటే జయించటం చాలా సులువు అవుతుంది. మోహం ఎక్కడ నుంచి వస్తుందో దాని మూలాన్ని కనుక తెలుసుకుంటే దానిని జయించడం కూడా నీకు తేలిక అవుతుంది. రాముడు రావణాసురుడిని ఎలా జయించాడు? విభీషణుడు రావణుడిని ఎక్కడ కొడితే చనిపోతాడో రాముడికి చెప్పాడు. అంటే రావణాసురుడు ఎక్కడ కొడితే చనిపోతాడో ఆ రహస్యం రాముడికి తెలిశాక రావణాసురుడిని చంపగలిగాడు. ఆ రహస్యం విభీషణుడు చెప్పాడు. విభీషణుడు అంటే గురువు లాంటివాడు అన్నమాట మీకు. విభీషణుడు రాముడికి ఏమి చెప్పాడు అంటే ఫలానా చోట కొడితే వాడు చనిపోతాడు అని చెప్పాడు.



**గురువు చెప్పే ప్రతీ మాట,అది మాట కాదు, అది అనుగ్రహం. లోకానికి సంబంధించిన ప్రయోజనం కోరి చెపితే అది మాట. కేవలం మిమ్మల్ని జ్ఞానగంగలో ముంచటానికి ఆయన చెపుతున్నాడు. అది మాట కాదు, అది అనుగ్రహము.**

గురువు ఏమి చేస్తాడు అంటే ఏవిధంగా వాసనను తొలగించాలి అనే మార్గం సూచిస్తూ ఉంటాడు. రంగన్ భగవాన్‌తో ఏమన్నాడు అంటే ఈ గొడవలు అన్నీ మేము ఎక్కడ పడతాము అది కూడా ఆ remove చెయ్యడం కూడా నువ్వే చెయ్యి అని చెప్పాడు. ఆ వాసనని జయించడానికి మేము ఎక్కడ తిప్పలు పడగలం మా శరీరం వయసు చూస్తే తక్కువ, వాసన వయస్సు చూస్తే ఎక్కువ, మా శరీరానికి వయస్సు అరవై ఏళ్ళో, డబ్భై ఏళ్ళో ఉంది. వాసన ఎన్ని వేల సంవత్సరాల నుంచి వస్తోందో తెలియదు దాని వయసు ఎక్కువ, శరీరానికి వయసు తక్కువ. మా సాధన వయసు తక్కువ. ఇవన్నీ ఎక్కడ పడగలం, బట్టలు కావాలంటే డబ్బులిస్తాను కొట్టు దగ్గరకి వెళ్లి బట్టలు కొని తెచ్చుకో అంటే ఇదంతా ఎక్కడ పడగలం? నువ్వే కొనాలి నువ్వే బట్ట తేవాలి, నువ్వే కుట్టించాలి, నువ్వే తొడగాలి అని రంగన్ అన్నాడు. అప్పుడు భగవాన్ ఏమన్నారు అంటే నేనే అన్నం వండుతాను, కూరలు వండుతాను, అరటాకు కూడా నేనే తెస్తాను, వడ్డన కూడా నేనే చేస్తాను, కాని మింగటం నువ్వు మింగాలి కదా అని రంగన్‌తో అన్నారు. అదొక్కటే జీవుడు చేస్తే చాలు మిగతావి అన్నీ గురువే చేసి పెడతాడు. గురువు అనుగ్రహం అటువంటిది. మీకు అర్థం అవుతోందా, భౌతికంగా అన్ని ప్రేమల్లోకి తల్లి ప్రేమ చాలా గొప్పది అని చెబుతారు. అటువంటి తల్లి ప్రేమని కూడా మరపించావయ్యా అరుణాచలేశ్వరుడా, అటువంటి తల్లి ప్రేమ కూడా నీ ప్రేమ ముందు ఒట్టిదే సూర్యుడి ముందు దీపం లాంటిది. అందుచేత ఓ అరుణాచలేశ్వరుడా మాములుగా భౌతికంగా చూస్తే తల్లి ప్రేమ చాలా గొప్పది దానిని నేను కాదు అనటం లేదు కానీ నీ ప్రేమ ముందు తల్లి ప్రేమ కూడా ఒక ప్రేమా, అదొక లెక్కా, తల్లి ప్రేమకంటే నీ ప్రేమ గొప్పది అని అరుణాచలేశ్వరుడి తోటి అక్షరమణమాలలో చెప్తారు. మీరు బ్రహ్మానుభవం పొందారు అనుకోండి వెధవ శరీరాలు ఏదోక రోజున పోతాయి. కాలిస్తే బూడిద అవుతాయి. కప్పెడితే మన్ను అవుతాయి. ఆ గొడవ వదిలెయ్యండి. ఇప్పుడు కాలువలో లాంచీ వెళు తోంది అనుకోండి, ఆ లాంచీ వెళ్ళేటప్పుడు కెరటాలు వచ్చి ఒడ్డుకి కొడుతూ ఉంటాయి. అలా బ్రహ్మానుభవం పొందిన వాడికి శరీరం పడిపోయిన తరువాత కూడా ఆ శాంతి

సముద్రం నుండి వచ్చిన కెరటాలు జీవకోటిని ముంచేస్తూ ఉంటాయి. అక్కడ శరీరం తోటి పనిలేదు, శరీరం ఉండక్కర్లేదు.

భగవాన్ శరీరం విడిచిపెట్టేటప్పుడు అక్కడ ఉన్న భక్తులు ఆయనతో మీరు వెళ్ళిపోతున్నారు, మేము ఉండిపోతున్నాము, ఇంక మమ్మల్ని ఎవరు చూస్తారు అని అడిగితే రమణమహర్షి గారు అన్నారు మిమ్మల్ని ప్రేమిస్తున్నది ఈ శరీరమా? శరీరం ఉంది అనుకోండి, శరీరం ఉన్నప్పుడు కూడా మిమ్మల్ని ప్రేమించేది ఈ శరీరం కాదు. ఏదైతే మిమ్మల్ని ప్రేమిస్తోందో అది శరీరం పడిపోయిన తరువాత కూడా ఉంటుంది. దానికి చావు లేదు. ఇంక శరీరం గొడవ ఎందుకు? ఆ సద్వస్తువు, ఆ సత్య వస్తువు మనకి అనుభవంలోకి వచ్చే వరకు మరణ భయం తప్పదు. ఆ సత్య వస్తువు ఎప్పుడైతే అనుభవంలోకి వచ్చిందో ఇంక మరణ భయం వాడికి ఉండదు. మరణం లేని స్థితికి ఎదిగాడు కాబట్టి వాడిని మరణం ముట్టుకోదు. ఒకొక్కసారి మనకి విరోధులు అనుకునేవారు ఉపకారం చేస్తారు. మనకి స్నేహితులు అనుకునే వాళ్ళు మనకి ఒకొక్కసారి అపకారం చెయ్యవచ్చు. యేసుక్రీస్తు దేవుడి కుమారుడు అన్నాడు ఒకడు. అప్పుడు యేసు అన్నాడు ముప్పై రూపాయల లంచానికి లొంగిపోయి మూడు రోజుల్లో నేను ఎక్కడ దాక్కున్నానో గవర్నమెంటుకి పట్టిస్తావు అన్నాడు. మూడు రోజులు చాలు అన్నాడు విశ్వాసం పోవడానికి. ఒకటి జ్ఞాపకం ఉంచుకోండి, తెలివైన వాళ్ళకి reason ఎక్కువ ఉంటుంది. అంత reason మనకి ఉండదు. వాళ్ళు reason తోటి ప్రయాణం చేస్తారు, మనం feelings తోటి ప్రయాణం చేద్దాము. Reasonకి ఎంత శక్తి ఉంటుందో, feelingకి కూడా అంతే శక్తి ఉంటుంది. మన హృదయ స్పర్శ తోటి, ఆ feeling తోటి, ఆ భావన తోటి, మనం ప్రయాణం చేద్దాము. వాళ్ళకి ఉన్న బుర్రలు మనకి ఎక్కడ ఉన్నాయి. మనకి బుర్రలు లేవు. అందుచేత reasonతోనే వాళ్ళు ముందుకు వెళ్ళిపోతారు. మన feelings తోటి మనం కూడా ఈశ్వరుడి దగ్గరకి వెళ్లిపోవాలి. వాళ్ళని reason తోటి రానివ్వండి. పోనీ వాళ్ళు లాంచీ మీద వస్తే మనం పడవ మీదే

దాటదాం ఇవతల ఒడ్డున ఎంతసేపు కూర్చుంటాం. ఈ గట్టు నుంచి ఆ గట్టుకి, అజ్ఞానం అనే ఈ వైపు నుంచి జ్ఞానం అనే అవతల వైపుకి reason ఉన్నవాళ్ళు లాంచీల మీద వెళ్లిపోతుంటే మనం కనీసం బొట్లు వేసుకుని అయినా పోదాం పది నిమిషాలు ఆలస్యం అవుతుంది కానీ, ఆ గట్టుకి మనం కూడా చేరతాం. ఎందుచేత అంటే reasonకి ఎంత బలం ఉందో feelingకి కూడా అంత బలం ఉంది. Reasonకి ఎంత శక్తి ఉందో feelingకి, భావనకి కూడా అంతే శక్తి ఉంది. ప్రతీ దానికి మనం ఇష్టం, అయిష్టం, రోత ఇవన్నీ పెట్టుకోవద్దు. కొంతమంది మనుషులని చూస్తే ఇష్టం, కొంతమంది మనుషులని చూస్తే అయిష్టం. ఇవన్నీ కూడా నువ్వు పెట్టుకోవద్దు. అవన్నీ వద్దు. నీవు ఒక్కటే జ్ఞాపకం ఉంచుకో ఇష్టాలు, అయిష్టాలు, రాగాలు, ద్వేషాలు, కోపాలు, తాపాలు, లాభాలు, నష్టాలు, ఆందోళన, ఆవేశాలు, ఆశయాలు ఇవన్నీ కూడా అజ్ఞానం వల్లే పుడుతున్నాయి. కడుపు నొప్పి వస్తుంది అనుకోండి అక్కడ ఏదో disorder ఉంది. తలకాయ పోటు వస్తుంది అనుకోండి అక్కడ ఏదో disorder ఉంది. మోకాళ్ళ నొప్పులు వస్తున్నాయి అనుకోండి అక్కడ disorder ఉంది. అదే విధంగా ఈ హెచ్చు తగ్గులు మీకు వస్తున్నాయి అంటే, రాగ ద్వేషాలు మీకు వస్తున్నాయి అంటే, ఇష్టాయిష్టాలు వస్తున్నాయి అంటే, కోప తాపాలు వస్తున్నాయి అంటే లోపల పెంట ఉంది, అదే అజ్ఞానం. అజ్ఞానం అనే పెంట నీకు కనిపించకపోవచ్చు. ఎక్కడో చెట్టు చాటున పెంట ఉంది అనుకోండి, ఆ పెంట మనకి

**గురువు అంటే మన స్కూలులో పాఠాలు చెప్పే మాష్టారు కాదు. ఏ బ్రహ్మం గురించి, ఆత్మ గురించి అయితే చెపుతున్నాడో అది అయి ఉండాలి, వాడు గురువు.**



కనిపించకపోవచ్చు కాని పెంట నుంచి వచ్చే వాసన మటుకి మనకు వస్తూ ఉంటుంది. అయితే నీ లోపల అజ్ఞానం ఉంది. అజ్ఞానం ఉందని నీకు తెలియకపోవచ్చు. నీ లోపల అజ్ఞానం ఉంది కాబట్టి దానికి సంబంధించిన ఇష్టాయిష్టాలు, రాగ ద్వేషాలు వస్తున్నాయి. అక్కడ పెంట లేకపోతే వాసన రాదు. లోపల అజ్ఞానం లేకపోతే ఈ likes, dislikes, రాగాలు, ద్వేషాలు, కోపాలు, తాపాలు, నీకు రావు. వస్తుంటే లోపల అజ్ఞానం ఉన్నట్టే. ఎందుకు అజ్ఞానాన్ని పెంచుకుంటూ పోవడం, వీటికి విలువ ఇస్తుంటే అజ్ఞానానికి విలువ ఇస్తున్నట్టే. అంటే అజ్ఞానం మూలం. అజ్ఞానం ఎక్కడ నుంచి వచ్చింది. అక్కర్లేని గొడవలు అన్నీ ఎందుకు వస్తున్నాయి. పెంట మీద పడేసే విషయాల గురించా నువ్వు ఆలోచించేది జీవితం పొడవునా. అజ్ఞానం లోంచే అన్ని గొడవలు వస్తున్నాయి అని నేను చెబుతున్నాను. అసలు ఈ అజ్ఞానం ఎక్కడ నుంచి వచ్చింది?

నువ్వు ఎవరో నీకు తెలియకపోవటం, నీ స్వరూపం ఏమిటో నీకు తెలియకపోవటమే అజ్ఞానం. అజ్ఞానం అనేది ప్రత్యేకంగా లేదు. నువ్వు ఎవరో నీకు తెలియకపోవడం వలన ఈ గొడవలు అన్నీ వచ్చి నీ మీద పడ్డాయి. అజ్ఞానం అనేది ప్రత్యేకంగా ఒక పదార్థం కాదు. నువ్వు ఎవరో నీకు తెలియకపోవడమే అజ్ఞానం. అజ్ఞానం లోంచే అన్నీ వస్తాయి. రాగాలు వస్తాయి, ద్వేషాలు వస్తాయి, లాభాలు వస్తాయి, నష్టాలు వస్తాయి, కష్టాలు వస్తాయి. పూర్వ జన్మలు, పునర్జన్మలు, ఇతర లోకాలు అన్నీ వచ్చేస్తాయి. ఈ planet గొడవలు మొత్తం సమస్తం కూడా వచ్చేస్తాయి. అజ్ఞానం నీకు ఎలా వస్తుంది? నువ్వు ఎవరో నీకు తెలియకపోవడమే అజ్ఞానం. అందుచేత నువ్వు నిజాన్ని తెలుసుకునే వరకు నిజం కానిది నీకు నిజం లాగా కనిపిస్తూ ఉంటుంది. నువ్వు చైతన్యాన్ని తెలుసుకుని జ్ఞానానుభవం పొందే వరకు, ఆత్మానుభవం పొందే వరకు ఈ కామ క్రోధాలు నిజం లాగే నీకు కనిపిస్తాయి, వాటి వెనకాల నువ్వు పరుగు పెడుతూనే ఉంటావు. ఎప్పటివరకు? నీకు ఆత్మానుభవం కలిగేవరకు. రాగద్వేషాలు నిజంగానే కనిపిస్తాయి, కామక్రోధాలు నిజంగానే కనిపిస్తాయి.

విషయ చింతన నిజం కింద కనిపిస్తుంది. నిజం కానిదంతా నిజం కిందే కనిపిస్తుంది. నువ్వు ఎవరో నువ్వు తెలుసుకునే వరకు, నిజం కానిది నీకు నిజంగా కనిపిస్తుంది కాబట్టి నువ్వు వాటి వెనుక పరుగు పెడుతూ ఉంటావు. ఎలాగ అంటే సీతమ్మకు బంగారపు లేడి కింద కనిపించినట్లు. సృష్టిలో అసలు బంగారపు లేడి ఉంటుందా? ఉండదు. కానీ సీతమ్మ అది బంగారపు లేడి అని భ్రమించింది. అలా భ్రమించటం వల్ల నానాకష్టాలు పడింది. ఈ అబద్ధమైన నేను కూడా అటువంటిదే. అది బంగారంలా కనిపిస్తుంది కాబట్టి దానిని విడిచి పెట్టి వెళ్ళడానికి మనకి ఇష్టం లేదు. నువ్వు విచారణ ఎక్కువ చెయ్యక్కర్లేదు, రవ్వంత చేసినా, ముల్లంత చేసినా సరిపోతుంది అంటున్నారు. విచారణ చేస్తే అది duplicate నేను, నిజమైన నేను కాదు, అది కృత్రిమమైన నేను అన్న సంగతి నీకు తెలుస్తుంది. ఏదైతే నీకు నేనుగా వ్యక్తం అవుతోందో, అది నిజమైన నేను కాదు అన్న సంగతి నీకు అనుభవంలోకి వస్తుంది. కృష్ణుడు అర్జునుడి తోటి అదే చెప్పాడు. నువ్వు చేతులు ఊపుతూ ఉండు మిగతా పని నేను చూసుకుంటాను అన్నాడు. నువ్వు ఎవడిని అయితే చంపాలి అనుకుంటున్నావో వాళ్ళు అందరూ చనిపోయి ఉన్నారు. ఆ భీష్ముడిని నేనే చంపేశాను, ద్రోణాచార్యుడిని నేనే చంపేశాను. కర్ణుడిని నేనే చంపేశాను వాళ్ళ ప్రాణాలు నేను ఎప్పుడో తీసేసి ఉంచాను. ఆ చనిపోయిన వాళ్ళని అందరినీ చేతులు ఆడించి చంపేస్తే అర్జునుడు బాగా యుద్ధం చేశాడు అని చెప్పుకుంటుంది. పని నాది, గౌరవం నీది అన్నాడు. మీకు అర్థం అవుతోందా. అర్జునుడు గొప్పగా యుద్ధం చేశాడు అని గౌరవం నీకు వస్తుంది. పని నేను పూర్తి చేసేశాను. ఆ చనిపోయిన వాళ్ళని చంపటమే నువ్వు చెయ్యవలసిన పని అన్నాడు. భారతదేశంలో పుట్టిన మహా వీరులలో అర్జునుడు ఒకడు. అటువంటివాడిని పట్టుకుని చేతులు ఊపితే సరిపోతుంది అన్నాడు. ఇంక మనం ఎంత? కానీ ఇక్కడ పరమాత్మ ఏమంటున్నాడు అంటే మనకు ఏదో ముక్కు ఉంది కాబట్టి గాలి చూసుకోవటం, మనస్సు ఉంది కాబట్టి ఏదో ధ్యానం చేసుకోవటం ఇలా కాలక్షేపం చేస్తూ ఉంటే నిన్ను లాక్కుంటున్నాను అంటున్నాడు పరమేశ్వరుడు. మొన్న డెన్మార్క్ నుంచి అరుణాచలం వచ్చిన అతను ఏమన్నాడు అంటే నా

పూర్వ దేహం నాకు జ్ఞాపకం లేదు. ఆ గత అనుభవం ఆ గత స్మృతి నాకు Repeatedగా వస్తోంది అన్నాడు. ఈ అరుణాచలం చూస్తున్నప్పుడు ఇది వరకు ఎప్పుడో చూశాను. ఎప్పుడు చూశానో గుర్తు రావడం లేదు. కానీ చూసిన ఆ అనుభవం నన్ను వెంటాడుతోంది. ఇది మొదటి సారి కాదు. పూర్వ జన్మల్లో ఎప్పుడో ఈ స్థలాన్ని చూశాను అని గుర్తు వచ్చింది. గుర్తొస్తే మర్చిపోవాలి కదా, ఆ గుర్తు, ఆ మధురమైన అనుభూతి నన్ను వెంటాడుతోంది. నాకు మరుపు రానివ్వటం లేదు, ఊపిరి సలపటం లేదు అన్నాడు డెన్మార్క్ ఆయన. ఆ remembrance పట్టుకుని మర్చిపోదాం అన్నా మరుపు రావడం లేదు. ఆ మధురమైన అనుభూతి, చిరాకుగా లేదు. ఆముదం నోట్లో వేసుకుంటే ఎలా ఉంటుందో అలా కాదు, పంచదార నోట్లో వేసుకుంటే ఎలా ఉంటుందో ఆ అనుభూతి అలా తియ్యగానే ఉంది చేదుగా ఏమీ లేదు ఆ అనుభవం. అది నన్ను వెంటాడుతోంది అని చెప్పాడు. అది శివానుగ్రహం, అరుణాచల శివుడు ఆయన పాదాల దగ్గరకి చేర్చుకోవడానికి ఒకసారి గతానుభవం స్మృతిలోకి తీసుకు వచ్చి పట్టుకొని వెంటాడుతున్నాడు. సాధన చేస్తున్నప్పటికీ సాధన చేస్తున్నట్టుగా అది కష్టం అనిపించటం లేదు. ఆ అనుభవం ఆయనని ఈశ్వరుడి పాదాల చెంతకు ఈడ్చుకు పోతుంది. ఈ పుస్తకంలో ఇలా ఉంది, ఆ పుస్తకంలో అలా ఉంది అనే మాటలు ఉండవు. ఆయన అనుభవంలోంచి తీసి పంచి పెట్టడమే. అది చైతన్య ప్రవాహం.

**నీ ప్రయత్నం తోటి ఇసుమంతయు, చింతాకంత కూడా సంబంధం లేకుండా, నీ మనస్సు యొక్క చాపల్యం ఎక్కడ ఆగిపోతోందో, ఎవరి సమక్షంలో ఆగిపోతోందో వాడే గురువు.**



ఒక మహా ప్రవాహంలో గడ్డి పరక ఎలా కొట్టుకు వెళ్తుందో, అలా మధుర నుంచి అరుణాచలం అంత వేగంగా కొట్టుకు వచ్చాను అన్నారు భగవాన్. ఆయన అంతా హృదయంలో నుంచి తీసి ఇవ్వటమే. దేవుడు ఉన్నాడా, లేడా అనేది సమస్య కాదు అవి చంటి పిల్లల మాటలు. భగవాన్ చెబుతూ ఉండేవారు – దేవుడు ఉన్నాడు అని చెప్పే వాళ్లకి, దేవుడు లేడని చెప్పే వాళ్లకి దేవుడు గురించి తెలియదు. వాడికి తెలియదు, వీడికి తెలియదు, నోటితోటి చెబుతున్నాడు అంతే. అదీ మాటే, ఇదీ మాటే. వాడికీ అనుభవం లేదు, వీడికీ అనుభవం లేదు. ఆ dialogue ఎంత బావుందో చూడండి. భగవాన్ దగ్గర ఆలోచించి చెప్పటం లేదు, immediate reply అంతే. కొంతమంది ఆలోచించి చెబుతాం అంటారు. భగవాన్ దగ్గర immediate reply, on the spot అక్కడికక్కడే అయ్యిపోయేది. ఇంకో గంట ఉన్నాక చెబుతాను లేకపోతే dictionary చూసి చెబుతాను ఈ మాటలు అక్కడ లేవు. ఆలోచించి చెప్పటాలు అనేవి ఏమి లేవు. నాకు కోరిక ఎందుకు వస్తుంది అని ఒక భక్తుడు అడుగుతున్నాడు. అది మంచో, చెడ్డో నాకు కోరిక ఎందుకు వస్తుంది అన్నాడు. నీకు సుఖపడాలి అని ఉంది కాబట్టి కోరిక వస్తుంది అని చెప్పారు. నాకు సుఖపడాలి అని ఎందుకు ఉంది అన్నాడు. నీ స్వరూపమే అది. నీ స్వరూపంలో సుఖం ఉంది కాబట్టి, నీకు సుఖపడాలి అని ఉంది అన్నారు. అందుచేత నువ్వు దానిని పొందాలి అనేటటువంటి desire కూడా సహజమే. కానీ అది ఎక్కడ ఉందో నీకు తెలియాలి. ఇది భగవాన్ చెప్పేది. ప్రపంచంలో ఏ వస్తువులోను సుఖం లేదు. మరి సుఖం ఎక్కడ ఉంది? నీ హృదయంలో మాత్రమే ఉంది. కాని మనం అది ఉన్నచోట వెతకటం లేదు, లేనిచోట వెతుకుతున్నాం. ఇలా వేలాది జన్మలు నువ్వు వెతికినా అది నీకు దొరకదు అన్నారు. ఎందుచేత అంటే అది ఉన్నచోట నువ్వు వెతకటం లేదు, లేనిచోట వెతుకుతున్నావు కాబట్టి. ప్రపంచంలో ఏ పదార్థంలోను సుఖం లేదు. ప్రపంచంలో ఏ వస్తువులోను, happiness లేదు. నువ్వు సుఖపడాలి అనే వాంఛ తప్పు అని నేను అనటం లేదు. అది సహజమైనదే. కానీ అది ఎక్కడ ఉంది, ఆ సుఖం అనేది ప్రపంచంలో ఏ పదార్థంలో కూడా లేదు. ఒకవేళ ఉందని

నువ్వు అనుకున్నప్పటికీ, పరిణామంలో అది నీకు దుఃఖాన్ని తీసుకు వస్తుంది. సుఖం ఎక్కడుంది? నీ స్వరూపంలోనే ఉంది. సుఖం ఎక్కడ ఉంది? చైతన్యంలోనే ఉంది. ఇప్పుడు ఏదైనా జరిగిపోయింది అనుకోండి. జరిగిపోయిన గొడవలు అన్నీ మర్చిపో, ఒకవేళ నీకు ఎవరైనా అపకారం చేస్తే forgive చెయ్యి. ఎవడు forgive చెయ్యగలడు అంటే ఇచ్చే స్వభావం ఉన్నవాడు forgive చెయ్యగలడు. క్షమాగుణం ఉన్నవాడు క్షమించగలడు కానీ క్షమాగుణం లేనివాడు క్షమించలేడు. Give ఇవ్వటం అలవాటు ఉన్నవాడు. Medical college principal గా చేసిన ఒక అమ్మగారు అంటూ ఉండేవారు నాకు forgive సాధ్యమే, forget మటుకు సాధ్యం కావటం లేదు అనేవారు. నాకు ఎవరైనా అపకారం చేస్తే వాడిని క్షమించ గలుగుతున్నాను. కానీ వాడిని చూసినప్పుడు మటుకి నాకు అపకారం చేశాడు అనేటటువంటి జ్ఞాపకం పోవడం లేదు. ఆవిడకి ఎవరైనా అపకారం చేశారు అనుకోండి ఆవిడ తిరిగి అపకారం చెయ్యటం లేదు వారిని క్షమిస్తున్నారు, కానీ ఆ remembrance పోవటం లేదు. ఆ మనిషి ఎక్కడైనా రోడ్డు మీద కనిపించాడు అనుకోండి, వీడు మనకి అపకారం చేశాడు అనేటటువంటి remembrance మటుకు ఆవిడకి పోవటం లేదు. Forgive నాకు సాధ్యం అవుతోంది, కానీ forget మటుకు నాకు సాధ్యం కావటం లేదు అంటున్నారు. కొంతమంది అస్తమాను మా అత్తగారు ఇలా అన్నారు, మా అత్తగారు అలా అన్నారు అని రాపాడించుకుంటూ ఉంటారు. దాని వలన లోపల energy వేస్ట్. ఇవాళ అంటే ఈవిడ మంచం పట్టింది కానీ పూర్వం వేపించుకుని తినేసింది అంటారు కొంతమంది కోడళ్ళు, అంటే forgive లేక క్షమించలేక పోతారు. ముసలి వాళ్ళు అయిపోయి మంచం పట్టి ఆ మంచం మీదే వారికి అన్నీ చేస్తూ ఉంటారు కాని అప్పుడు కూడా వాళ్ళు క్షమించలేరు. అప్పుడు కూడా మర్చిపోలేరు. forget అంత కష్టం. మీకు లోపల తూకం ఉన్నప్పుడు, మీకు లోపల శాంతి ఉన్నప్పుడు, ఆ కాంతి ఉన్నప్పుడు నువ్వు క్షమించగలవు కానీ లేకపోతే క్షమించడం కూడా నీకు సాధ్యం కాదు. క్షమ లేకపోతే క్షమించలేవు. ఆనందం ఎక్కడ ఉంది? ఆత్మలో ఉంది. ఆత్మ అంటే ఏమిటి? సత్, చిత్, ఆనందం. సత్ అంటే existence, చిత్ అంటే knowledge. చిత్ అంటే

ఏమిటి, knowledge, ఆనందం bliss ఈ మూడు ఉంటాయి. ఎప్పుడైతే ఆ బ్రహ్మానుభవం, ఆత్మానుభవం నీకు కలిగిందో ఈ మూడు కూడా నిన్ను వరిస్తాయి. ఎందుచేత అంటే అందులో existence ఉంది, knowledge ఉంది, bliss ఉంది. డైరెక్ట్‌గా నిన్ను అక్కడకి తీసుకు పోవడానికి ప్రశ్నిస్తున్నాడు భగవాన్. అదే ఆయన చేసేది. ఆ వస్తువు అయ్యి ఉన్నాడు గురువు. బాహ్యమైన గురువు లోపలకి గెంటుతాడు, లోపల గురువు లోపలకి గుంజుకుంటాడు అన్నారు భగవాన్. బాహ్యమైన గురువు ఏమి చేస్తాడు అంటే మనసు యొక్క చపలత్వాన్ని ఆపి దానిని లోపలకి తోలుకు పోతాడు. నిజమైన గురువు నీ లోపల ఉన్నాడు. బయట ఉన్నవాడు ఏమో లోపలకు తోలుకు వెళతాడు, లోపలున్న గురువు దానిని లోపలకి గుంజుకుంటాడు.

మాణిక్యవాచకర్ greatest Poet. మాణిక్యవాచకర్ అనే పేరు ఆయనకి ఎందుకు వచ్చింది అంటే ఆయన ఏమి మాట్లాడినా, ఏమి రాసినా మాణిక్యాల్లా ఉంటాయి. మాణిక్యవాచకర్ కొంతకాలం మినిస్టర్‌గా కూడా చేశారు. ఆ మినిస్టర్ గొడవలో పడిపోతాడు ఏమో, మనల్ని మర్చిపోతాడేమో అని ఈశ్వరుడు ఏమి చేశాడు అంటే మాణిక్యవాచకర్‌కి ఆ మంత్రి పదవి పోగొట్టటం కోసం, ఈయన మినిస్టర్ చేసినప్పుడు గుర్రాలు ఈశ్వరుడే దొంగతనం చేసి వీడు దొంగతనం చేసినట్టు రాజు దగ్గర ఆరోపించి వీడికి మినిస్టర్ పదవి ఊడగొడతాడు. ఎందుకంటే ఆ పదవి ఊడగొడితేనే కానీ నా దగ్గరకు రాడు అని ఈశ్వరుడు అలా చేస్తాడు. ఆ మినిస్టర్ పదవి ఎందుకు ఊడ గొడతాడు అంటే ఈయనలో ఐక్యం చెయ్యడం కోసం. చిదంబరంలో వాడి శరీరం శవం అవ్వలేదు, చిదంబరంలో నటరాజ స్వామి దగ్గర వేలాదిమంది చూస్తుంటే ఆయన భౌతికశరీరం తోటి నటరాజస్వామిలో ఐక్యం అయ్యాడు, వాడు మాణిక్యవాచకర్ అంటే. ఏది రాసినా, ఏది మాట్లాడినా, మాణిక్యంలాగే ఉంటుంది. అందుకే మాణిక్యవాచకర్ అని పేరు పెట్టారు. మాణిక్యవాచకర్ చెప్పుకు పోతూ ఉండేవాడు, రాసేవాడు ఎవడు కనపడటం లేదు. అయ్యో ఇంత మాణిక్యాలు

లాంటి వచనాలు పోతున్నాయి అని శివుడే వచ్చి, రాశాడు. ఇంకా రెండు రోజులకి ఆయన శరీరం విడిచి పెడతాడు అనగా, నువ్వు చాలా మంచి మంచి మాటలు చెప్పావు. నువ్వు చెప్పిన మాటలు నేను రాసుకుంటాను చెప్పు అన్నాడు. అవన్నీ ఇప్పుడు నాకు ఎక్కడ జ్ఞాపకం వస్తాయి చెప్పేది ఏదో ఆ ధోరణిలో చెప్పేశాను. ఇప్పుడు నాకెక్కడ జ్ఞాపకం వస్తాయి అన్నాడు మాణిక్యవాచకర్, జ్ఞాపకం ఉన్నమటుకే చెప్పు అన్నాడు. వచ్చిన వాడు ఈశ్వరుడు. అంటే ఆయన మాటలు లోకానికి అందివ్వడం కోసం, ఆ మాటలు వృధాగా పోతున్నాయి అని ఈశ్వరుడు వచ్చి రికార్డు చేసుకున్నాడు వాడు మాణిక్యవాచకర్. మురుగనార్ 1923వ సంవత్సరంలో భగవాన్ దగ్గరకి వచ్చాడు. మురుగనార్ వచ్చేటప్పటికీ భగవాన్ నులక మంచం మీద కూర్చున్నారు. మురుగనార్ ఏమి చేశాడు అంటే ఆయన poet కదా భగవాన్ మీద ఐదు పద్యాలు రాసి ఆ కాగితం, ఒక అరటి పళ్ళ అత్తం తీసుకుని వచ్చాడు. భగవాన్ నులక మంచం మీద ఒక్కరే కూర్చున్నారు. సరిగ్గా మురుగనారుని చూడగానే లేచి వచ్చారు, అది జన్మాంతర అనుబంధం. అప్పుడు మురుగనార్ ఆ అరటి పళ్ళ అత్తం ఆయన చేతిలో పెట్టి, పద్యాలు రాసిన కాగితం ఆయన చేతిలో పెట్టాడు. భగవాన్ అరటి పళ్ళ అత్తం చేతితోటి పుచ్చుకుని, మురుగనార్ రాసిన ఐదు పద్యాలు చదివి నువ్వు మాణిక్యవాచకర్‌లాగా రాయగలవా అని అన్నారు. మాణిక్యవాచకర్ నటరాజుని స్తుతిస్తూ ఎన్ని వేల పద్యాలు రాశాడో, మరి భగవాన్ నోటి వెంట వచ్చిన ముహూర్తం ఏమిటో కానీ అన్ని వేల పద్యాలు భగవాన్ మీద రాశాడు మురుగనార్. ఆవు దూడని పెట్టగానే, ఆ దూడ



**వీక్ మైండ్ ని స్ట్రాంగ్ మైండ్ గా మార్చి దానికి లోచూపు కలుగచేసేవాడే గురువు. కంటిని రెప్ప ఎలా కాపాడుతుందో, అలాగ గురువు మనల్ని కాపాడుతూ ఉంటాడు.**

మీద ఉన్న మాయను ఆవు ఎలా నాకుతుందో, గురువు అలా నాకాలి అని కొంతమంది చెబుతూ ఉంటారు. దూడ మీద ఉన్న మాయని ఆవు నాకుతుంది. ఎందుకు అంటే దూడని శుభ్రం చెయ్యాలనే కాంక్ష, అదే విధంగా గురువు కూడా మన అలవాట్లను నాకుతాడు ఎందుకు అంటే అవే మనకు అడ్డుగా వస్తున్నాయి అని వాడికి తెలుస్తూ ఉంటుంది కాబట్టి. ఒక జన్మ వెనకైన, ముందు అయినా వస్తువును అనుభవంలోనికి తీసుకొని వస్తాడు అంతేకాని వాడిని విడిచి పెట్టడు. పులి నోట్లో పడ్డ మాంసపు ముక్క బయటకి వస్తుంది కానీ, గురువు అనుగ్రహంలో పడిన వాడు రక్షింప పడతాడు, తరింప పడతాడు కానీ escape అవ్వడానికి అవకాశం లేదు. పులి నోట్లో పడ్డ మాంసపు ముక్క వస్తే బయటకి వచ్చేయచ్చు. కానీ ఎవడైతే గురువు అనుగ్రహంలో పడ్డాడో, వాడు రక్షింపబడవలసిందే. పెరుమాళ్ళు నువ్వు చేసిన కర్మను బట్టి ఒకవేళ నరకానికి వెళ్తావు అనుకో, నీకోసం నేను నరకానికి వస్తాను పెరుమాళ్ళు అంటారు భగవాన్. అప్పుడు పక్కవాడు పెరుమాళ్ళు మీకు చాలా అపకారం చేశాడు అని భగవాన్ తోటి అంటాడు. వాడు చేసిన అపకారం ఎందుకు జ్ఞాపకం చేసుకోవాలి. వాడు చేసిన ఉపకారమే మనం జ్ఞాపకం చేసుకుందాం అన్నారు భగవాన్, వాడు భగవంతుడు అంటే. వాడు నాకు అపకారం చేశాడు అని మీరు అంటున్నారు. వాడు చేసిన అపకారం ఎందుకు మనం జ్ఞాపకం చేసుకోవడం. వాడు చేసిన ఉపకారమే మనం జ్ఞాపకం చేసుకుందాం అని భగవాన్ అన్నారు. ఏ కారణం వల్ల నీకు దుఃఖం వస్తున్నప్పటికీ, ఇంకొకడు చెప్పక్కర్లేదు. ఉపనిషత్తు, భగవద్గీతలో అధ్యాయాలు ఈ గొడవలు అన్నీ చూసుకోవక్కర్లేదు. ఏ కారణం వల్ల మీకు దుఃఖం వచ్చినప్పటికీ అక్కడ జీవ లక్షణాలు ఉన్నట్టే గుర్తు. నీకు కడుపులో నొప్పి వస్తుంటే ఏదో లోపం అక్కడ ఉంది. అదే విధంగా ఏ కారణం వల్ల మీకు దుఃఖం వస్తున్నప్పటికీ జీవ లక్షణాలు లేకుండా అక్కడ దుఃఖం రాదు. అందరికీ ఒకే కారణం వల్ల దుఃఖం రాదు. ఏ కారణం వల్ల దుఃఖం వచ్చినప్పటికీ జీవ లక్షణాలు అక్కడ ఉన్నట్టే లెక్క. ఆనందం మీకు విడిగా లేదు. బయట ఎక్కడ వెతికినా లాభం లేదు. దానికోసం జీవితం పొడవునా లోకంలో వెతికినా అది దొరకదు. ఎందుచేత అక్కడ లేదు కాబట్టి నీకు దొరకదు.

సుఖం కోసం ప్రతీ జన్మలో లోకంలో వెతుకుతూ ఉంటావు అనుకో అక్కడ లేదు కాబట్టి నీకు వెతికినా దొరకదు. సుఖం ఎక్కడ ఉంది? నీ స్వరూపంలోనే ఉంది, చైతన్యంలోనే ఉంది, బ్రహ్మంలోనే ఉంది.

లోకం లేకపోయినా, జీవుడు లేకపోయినా ఉన్నది బ్రహ్మమే. ఉన్నది బ్రహ్మమే, అప్పుడు జీవుడు లేకపోవచ్చు. లోకం లేకపోవచ్చు. జ్ఞానికి లోకం కనిపించినా ఒక్కటే, కనిపించక పోయినా ఒక్కటే. దేహం ఉన్నా ఒక్కటే, ఊడిపోయినా ఒక్కటే. మీకు అర్థం అవుతోందా, ఇక్కడ ఏమి చెపుతున్నారు అంటే నేను వచ్చాక నువ్వు వచ్చావు, నువ్వు వచ్చాక వాడు వచ్చాడు. నేనొచ్చాక నువ్వు అంటే లోకం వచ్చింది. లోకం వచ్చాక వాడు వచ్చాడు. అంటే దేవుడు వచ్చాడు. ముందు నువ్వు ఎవరో తెలుసుకుంటే అప్పుడు నీకు తెలిసిపోతుంది. ఫస్ట్ person వచ్చాక సెకండ్ person వచ్చింది. సెకండ్ person వచ్చాక third person వచ్చింది. ఫస్ట్ person ఎవరో నువ్వు విచారణ చేసి తెలుసుకుంటే ఇంక సెకండ్ person లేదు. సెకండ్ person, థర్డ్ person దేని మీద ఆధారపడి ఉన్నారు? ఫస్ట్ person మీద ఆధారపడి ఉన్నారు. ఫస్ట్ person అణిగిపోతే నువ్వు లేవు, వాడు లేడు. నేను అణిగిపోతే నువ్వు లేవు, వాడు లేడు. కాళిదాసు ఏమన్నాడు అంటే జన్మాంతరాళంలో మనకి ఏమి అనుబంధం లేదు అనుకోండి ఒకళ్ళ మీద ఒకళ్ళకి ప్రేమ కలగదు అన్నాడు. మన జన్మాంతరాలలో ఏదైనా అనుబంధం ఉంటే ప్రేమ కలుగుతుంది. ఏమి అనుబంధం లేదు అనుకోండి చూసినా ప్రేమ కలగదు, ఆప్యాయత కలగదు అన్నాడు కాళిదాసు. సుఖం, ఆనందం లోకంలో లేదు. మరి ఎక్కడ ఉంది? నీ హృదయంలో ఉంది, నీ స్వరూపంలోనే ఉంది. నీ లోపల చైతన్యం ఉంది, ఆ చైతన్యం లోనే అది ఉంది. భగవాన్ ఏమంటున్నారు అంటే నువ్వు దానికోసం బయట ఎక్కడ వెతికినా లాభం లేదు. అది ఉన్నచోట వెతికితే ఈనాటికైనా, ముందు నాటికైనా, అది నీకు దొరుకుతుంది. ఈ జన్మలో అయినా, మరొక జన్మలో అయినా దొరుకుతుంది. అది ఉన్నచోట నీ అన్వేషణ కనుక ఉంటే, కానీ లేనిచోట

వేలాది జన్మలు వెతికినా నీకు అది దొరకదు. కోపం ఎక్కడ ఉంది, మనస్సులో ఉంది. చిరాకు ఎక్కడ ఉంది, మనసులో ఉంది. ద్వేషం ఎక్కడ ఉంది? మనసులో ఉంది. కక్ష ఎక్కడ ఉంది, మనసులో ఉంది. అసూయ ఎక్కడ ఉంది, మనసులో ఉంది. మనసును మనం స్వాధీనం చేసుకుంటే అవి కూడా మనకి స్వాధీనం అవుతాయి అంతే రహస్యం అంతకంటే ఏమీ లేదు. చిన్న విషయం మీరు రహస్యంగా పెట్టుకోండి. మనం రహస్యాలు అనుకున్నవి రహస్యాలుగానే ఉంచండి. మనం ఇప్పుడు ఇలా కూర్చున్నాం అనుకోండి మాటవరసకి. ఎవరిమీద అయిన మనకి ఏదొక కారణం వల్ల అసూయ వచ్చింది అనుకోండి. తప్పనిసరిగా మనకి మానసిక ఆరోగ్యంలో, శారీరక ఆరోగ్యంలో ఎంతో కొంత తేడా వచ్చేస్తుంది. దేవుడి మాట వదిలెయ్యండి, ఎవరినైనా చూసి అసూయ వచ్చింది అనుకోండి లేకపోతే ఏదో కోపం కలిగింది అనుకోండి చూసేటప్పటికీ అది మానసిక ఆరోగ్యం మీద, శారీరక ఆరోగ్యం మీద immediateగా దాని ప్రభావం కనిపిస్తుంది. హృదయ పూర్వకంగా మాట్లాడే వాళ్ళ కళ్ళల్లో హృదయం ఉంటుంది. కొంతమందికి మాటమాటకి కోపం వచ్చేస్తుంది వాళ్ళ కళ్ళల్లో కోపం ఉంటుంది. అందుచేత ఎవరిని చూసి మనం అసూయ పడ్డా తప్పనిసరిగా మానసిక ఆరోగ్యం ఎంతో కొంత చెడుతుంది, దేహం యొక్క ఆరోగ్యం కూడా ఎంతో కొంత చెడుతుంది, Spiritual Growth తగ్గిపోతుంది. అర్జునా! నువ్వు అనసూయుడవు, అసూయ అనేది ఎలా ఉంటుందో నీకు తెలియదు, అందుచేత నీకు ఈ గీతా శాస్త్రం చెబుతున్నాను అన్నాడు అర్జునుడు తోటి కృష్ణుడు. అసూయ వలన ఆధ్యాత్మిక వికాసం ఆగిపోతుంది. ఎదిగే మొక్కలని దూడ తినేస్తే ఎలా ఉంటుందో, అలా spiritual growth ఆగిపోతుంది. అప్పటికప్పుడు ఆగిపోతుంది. నువ్వు ఆత్మని వెతుకు, వెతికితే దొరుకుతుంది, దొరికాక నువ్వు అక్కడ స్థిర పడవచ్చు. అప్పుడు దేనికోసం అయితే నువ్వు వెతుకుతున్నావో అది నీ స్వరూపంగా వ్యక్తం అవుతుంది. ఏమి beautiful teaching చూడండి.

దేనికోసం అయితే నువ్వు వెతుకుతున్నావో అది నీ స్వరూపంగానే వ్యక్తం అవుతుంది.

ముందు వెతుకు వెతికితే దొరుకుతుంది. దొరికితే అక్కడ స్థిర పదుదువు గాని, చిన్న చిన్న మాటలు చూడండి. వస్తువు కనుక అనుభవంలో లేకపోతే ఆ చిన్న మాటలు కూడా ఎవరు చెప్పలేడు. లక్ష్మిని చూడటానికి వెళ్ళటం కోసం నేను గుమ్మం దిగాను అనుకోండి నేను గుమ్మం దిగటం లక్ష్మిని చూద్దామని దిగాను. నేను సరిగ్గా గుమ్మం దిగేటప్పటికీ లక్ష్మి నాకు ఎదురు వచ్చింది అనుకోండి, అప్పుడెలా ఉంటుంది. అలా సుఖం నీకు ఎదురు అవుతుంది. నువ్వు వెతికేది నీకు ఎదురు అవుతుంది. నువ్వు ఏ వస్తువు కోసం అయితే వెతుకుతున్నవో అదే నీకు ఎదురు అవుతుంటే ఇంకేమి కావాలి నీకు. ఆ సుఖం నీకు ఎదురు అవుతుంది. ఆ సుఖం నీకు స్వరూపంగా వ్యక్తం అవుతుంది. ఒకసారి ఆ సుఖం కనుక నిన్ను పట్టుకుంటే, ఆ శాంతి కనుక నిన్ను పట్టుకుంటే, ఆ జ్ఞానం కనుక నిన్ను పట్టుకుంటే అది ఇంక నిన్ను విడిచి పెట్టదు. అది నష్టపోదు. నువ్వు ఇంక ఎక్కడికీ escape అవ్వలేవు. బాహ్యామైన వస్తువులు మనం అనుభవించే కొలది తరిగిపోతాయి. ఆత్మసుఖం అనుభవించేకొలది పెరుగుతుంది అది దాని గొప్పతనం. నీకు ఏమైనా సంపదలు ఉన్నాయి అనుకోండి అనుభవించే కొలది తరుగుతాయి. ఆత్మ సుఖం, ఆత్మ శాంతి, ఆత్మ జ్ఞానం అటువంటిది కాదు. అది పంచే కొలది పెరుగుతుంది, అనుభవించే కొలది పెరుగుతుంది. అది నష్టపోదు, నువ్వు పంచి పెట్టేకొలది పెరుగుతూ ఉంటుంది. నా దగ్గర పది రూపాయలు ఉన్నాయి అనుకోండి పంచి పెడితే తరిగిపోతాయి. ఆత్మ సుఖం, ఆత్మ శాంతి, ఆత్మ జ్ఞానం, ఆత్మానుభవం, ఆ చైతన్యానుభవం అటువంటిది కాదు నువ్వు పంచి పెట్టె కొలది

**తల్లితండ్రులు నీ శరీరానికి జన్మ యిస్తారు. కానీ గురువు నీకు జ్ఞానంలో జన్మ యిస్తాడు. జ్ఞానంలో జన్మనిస్తే ఇంక ఈ భూమి మీదకు రావలసిన పని లేదు. అప్పుడు ఇంక ఎటుచూసినా ఆనందమే, ఎటు చూసినా శాంతే. బ్రహ్మజ్ఞానంతో జన్మనిచ్చేవాడే గురువు.**



అది పెరుగుతుంది. అది మీకేమి నష్టమయ్యేది కాదు. అది నిన్ను విడిచి పెట్టదు. ఒకవేళ దానిని విడిచి పెడదాం అని నీకు అనిపిస్తుంది అనుకో, ఆ సుఖం, ఆ శాంతి మటుకు నిన్ను విడిచి పెట్టదు. జిడ్డు లాగ పట్టుకుంటుంది ఆ సుఖం, ఇంక అది విడిచి పెట్టదు. అందులోంచి నువ్వు escape అయ్యే అవకాశం లేదు. అందులో కూరుకు పోతావు నువ్వు, ఆ శాంతి లోయల్లో, ఆ హృదయం యొక్క లోయల్లో నువ్వు కూరుకుపోతావు. ఇంక బయటకి వచ్చేది లేదు. ఆ ఆనంద తరంగాలలో, శాంతి తరంగాలలో నువ్వు కొట్టుకు పోతావు. నేను, నాది అనేది అక్కడ ఊడిపోతుంది. రామకృష్ణ పరమహంస చెబుతాడు నువ్వు ఆ నేనుని పోగొట్టుకోవాలి. దానిని పోగొట్టుకోవాలి అంటే నువ్వు తెలివైన వాడివి అయితే విచారణ చేసి పోగొట్టుకో, లేకపోతే దేవుడికి ఇస్తే వాడు పోగొట్టేస్తాడు అన్నాడు రామకృష్ణుడు. శరణాగతి నిజమైన ప్రార్థన, అంతకు మించిన ప్రార్థన లేనే లేదు. బాహ్యంగా నువ్వు పెట్టే నమస్కారాలకి దేవుడు మోసపోడు. శరణాగతే నిజమైన గతి, ఆ mind, ఆ intellect, ఎంతవరకు surrender అవుతోందో చూసుకుంటాడు దేవుడు. ఇప్పుడు ఇంకొకటి జ్ఞాపకం పెట్టుకోండి. మీ ఇంటివద్ద నాలుగు మామిడి పళ్ళు ఉన్నాయి అనుకోండి, ఇతరులకు ఎవరికైనా ఇచ్చేటప్పుడు అందులో మంచి మామిడి పండు చూసి ఇవ్వండి. చాలామంది అందులో పనికిరానిది ఇస్తూ ఉంటారు. మీకు అర్థం అవుతోందా, దేవుడు ఊరేగుతూ మీ గుమ్మంలోకి వచ్చాడు అనుకోండి మీకు నాలుగు అరటి పళ్ళు ఉన్నాయి అనుకోండి, కుళ్ళిపోవటానికి సిద్ధంగా ఉన్న అరటి పండు తీసుకెళ్ళి ఇవ్వకండి. మీకున్న దాంట్లో మంచిదివ్వండి. నాలుగు మామిడి పళ్ళలో ఉన్నదాంట్లో మంచిది ఇవ్వండి. అంతకంటే ఏమి చేస్తారు, మీకు ఉన్నదాంట్లో మంచిది ఇవ్వండి అప్పుడు మీరు శివానుగ్రహానికి deserve అవుతారు. మనకి పునర్జన్మ ఎప్పుడు రాదు అంటే మనకి చనిపోయే రోజు వచ్చేటప్పటికి లోపల ఇంక దుఃఖం ఉండకూడదు. మరణం వచ్చే రోజుకి ఇంక మనకి దుఃఖం ఉండకూడదు. లోపల దుఃఖం అంతా బయటకి వచ్చేయాలి. లోపల ఉన్న దుఃఖం అంతా బయటకి వచ్చేస్తే ఇంక వాడికి పునర్జన్మ రాదు. ఒకవేళ దుఃఖం మిగిలి పోయింది అనుకోండి అది ఏడవటానికి

మళ్ళీ వాడు జన్మ ఎత్తాలి. రామకృష్ణుడు చిన్న చిన్న కథలు చెప్తాడు, సరదా ఆయనకి. రామకృష్ణుడు చెప్తాడు చేపలు పట్టేవాడు వల వేస్తాడు. ఈ వల వేసేవాడి పాదాల దగ్గరకి వచ్చిన చేప ఆ వలలో పడదు. అలాగే దేవుడు పాదాలను ఆశ్రయించిన వాడు మాయలో నుంచి బయటకి వచ్చేస్తాడు. వలలో పడ్డ చేపలు దాక లోకి వెళ్ళిపోతాయి. అలాగే మనం ఈ మాయలో పడ్డామా జనన మరణ ప్రవాహంలో అలా కొట్టుకు పోతాము. ఏమో ఎక్కడ తేలతామో చెప్పలేము. ఏ అవతార పురుషుడో, ఏ సద్గురువో, ఏ మహా జ్ఞానో కలుగజేసు కుంటే ఎక్కడైనా ఒడ్డుకు వస్తాం కానీ, లేకపోతే ఆ ప్రవాహంలో కొట్టుకుపోతాము. వలలో పడ్డ చేప ఇంక దాకలోకి వచ్చేస్తుంది. అలాగే మాయలో పడ్డవాడు ఆ ప్రవాహంలో కొట్టుకు పోతాడు. కానీ ఒక్కడు మటుకి బ్రతుకుతాడు అని చెప్పాడు రామకృష్ణుడు. వల వేసినప్పుడు సరిగ్గా చేప వల వేసేవాడి పాదాల దగ్గరకి వచ్చిందా ఇంక అది వలలో పడదు. అలాగే దేవుని పాదాలు ఎవరైతే ఆశ్రయించాడో వాడు దేవుడి మాయ లోంచి బయటకు వస్తాడు అన్నాడు రామకృష్ణుడు. దైనందిన జీవితంలో మీరు చేసే పని పని కింద కాకుండా ఆరాధన కింద చెయ్యాలి. ఆరాధన కింద చేస్తే శివానుగ్రహానికి మీరు పాత్రులు అవుతారు. చేతిలో డబ్బు ఉంటే బజారులో వస్తువు కొనుక్కోవటం ఎంత తేలికో, శివానుగ్రహం పొందిన వెంటనే జ్ఞానం కలగడం కూడా అంతే తేలిక. చేతిలో ఉన్న ముద్ద నోట్లో పెట్టుకోవటం ఎంత తేలికో, దేవుడి అనుగ్రహం కలిగిన వెంటనే ఆయన స్వరూపం మనకి దొరకడం కూడా అంతే తేలిక. చలం గారు ఏమన్నారు అంటే సూర్యుడు నుంచి వెలుతురు వస్తుంది. ఆ వెలుతురుని మనం ఎంజాయ్ చేస్తున్నాం. సూర్యుడు రాజులా, బ్రాహ్మణులా అన్న విచారణ మనకి ఎందుకు అసలు. భగవాన్ ఎవరో నాకు అక్కర్లేదు, భగవాన్ ఏమిటో నాకు అక్కర్లేదు. భగవాన్ ఎందుకో నాకు అక్కర్లేదు. ఆయన అవతార పురుషుడు అవ్వవచ్చు, కాకపోవచ్చు. ఆ గొడవ నాకు ఎందుకు. ఆయన నాకు ఆనంద సముద్రం, ఆయన నుండి నాకు ఆనందం, కాంతి, శాంతి వస్తున్నాయి. ఆయన దగ్గర నుంచి డైరెక్ట్ గా నేను ఏమి పొందుతున్నానో అది కావాలి కానీ, అప్రధానమైన విషయాలు నాకు చెప్పకండి

అన్నారు. ఆత్మను విడిచి పెట్టి, జ్ఞానాన్ని విడిచి పెట్టి ఏ విషయం అయినా భగవాన్ దగ్గర మీరు ప్రస్తావిస్తే భగవాన్ అనేవారు ఆ విషయాల గురించి ఆలోచించమని మీతోటి ఎవరు చెప్పారు, ఎంత ముద్దుగా ఉందో చూడండి ఆ మాట. ఉన్న సద్వస్తువు గురించి తప్పించి ఎవరు ఏమి ప్రస్తావించినప్పటికీ ఆ విషయాల గురించి ఆలోచించమని మీతో ఎవరు చెప్పారు అసలు, అది మాయని మీకు తెలియటం లేదు. మాయ అనే సైతాను మిమ్మల్ని అలా చేస్తుంది. అది మీకు తెలియటం లేదు.

గురువు ఏం చేస్తాడు అంటే బోయవాడు జంతువును ఎలా వెంటాడుతూ వెళతాడో, అలా మన అజ్ఞానాన్ని వెంటాడుతాడు. లోపల ఎక్కడైతే శాంతి ఉందో, ఆనందం ఉందో అక్కడకు హృదయ గుహలోనికి తీసుకొనిపోవటానికి, మన మనస్సును ప్రిపేర్ చేసి దానికి పవిత్రత కలుగజేసేవాడు గురువు. లోపల ఉన్న వస్తువు ఎంత ఏకాగ్రంగా ఉందో, ఎంత సహనంగా ఉందో, ఎంత పవిత్రంగా ఉందో మన మనస్సును కూడా అలా చేసి తదాకారం చెందేలా చేసి అందులో కలిపేస్తాడు, వాడు గురువు. వాడు ఏదో ఉపకారం చేస్తున్నాడు అని నువ్వు అనుకోవాలి అని ఆయన అనుకోడు. అలా అనుకొంటే వాడు గురువు కాదు.

సోదరమహాశయులారా! ఒక చిన్న విషయం మీరు గుర్తు పెట్టుకోండి. మీ గుండెల్లో గట్టిగా పెట్టుకోండి. మనం చనిపోయినా ఈ మాటలు మటుకు మీరు గుర్తు పెట్టుకోండి. మన శరీరాలు తేడాగా ఉన్నాయి. ఒక శరీరం లావుగా ఉంది, ఒక శరీరం సన్నంగా ఉంది. ఒక శరీరం ఎర్రగా ఉంది, ఒక శరీరం నల్లగా ఉంది, ఒక శరీరం తెల్లగా ఉంది. రంగులో చాలా తేడా ఉంది. అదే విధంగా కొంతమంది మనుషులు మొరటుగా ఉంటారు. కొంతమంది నాగరికంగా ఉంటారు. చాలా cultured గా ఉంటారు కొంతమంది, కొంతమంది un-cultured గా ఉంటారు. మన శరీరం యొక్క రంగులో తేడా ఉంది. అలాగే మన మనస్సులో ఉన్న గుణాల్లో కూడా తేడాలు ఉన్నాయి. మనలో కొన్ని మంచి గుణాలు ఉండవచ్చు, కొన్ని చెడ్డ గుణాలు ఉండవచ్చు. కొంతమంది మనుషులు మంచిగా

ఉండవచ్చు, గుణాలను బట్టి కొంతమంది మనుషులు చెడ్డగా ఉండవచ్చు. కానీ ఒకచోట మటుకి మనలో ఎక్కడా తేడా లేదు. హృదయంలో మటుకి మనం అందరం ఒక్కటే. మనం ఒక్కచోట మటుకి ఏకంగా ఉన్నాం. హృదయంలో మటుకి మనం అందరం ఒక్కటే. అది ఒక్కటే మీరు గుర్తు పెట్టుకోండి. అది ఒక్కటే మీరు మర్చిపోకండి. మీరు నాకు ఇచ్చే బహుమానం కూడా అదే. భగవాన్ ఎవరిని ముట్టుకునేవారు కాదు. Just చిన్న చూపు చాలు మీ పని పూర్తి అయిపోతుంది. Just అలా చూడటం తోటే సమాధి స్థితి వచ్చేది. టచ్ కూడా లేకుండా నువ్వు కళ్ళతోటే చేసే పనులు అన్నీ కూడా చేసేస్తున్నావు అన్నాడు గణపతి శాస్త్రి.

**అరుణాచలశివ, అరుణాచల శివ, అరుణాచల శివ, అరుణాచలా**

**అరుణాచలమనుచు స్మరియించు వారల అహము నిర్మూలింతువరుణాచల**

**అరుణాచలశివ, అరుణాచల శివ, అరుణాచల శివ, అరుణాచలా.**


## రమణ భాస్కర చందాదారులకు విన్నపం

**సంవత్సర చందా రు|| 150/-లు.**

**శాశ్వత చందా (10 సం||లకు) రు|| 1200/-లు.**

రమణ భాస్కర చందాదారులుగా చేరి పత్రికను ప్రోత్సహించవలసినదిగా కోరుచున్నాము. మీ చందాను స్వయంగా గానీ లేక

**శ్రీ రమణక్షేత్రం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యడ్ల బజార్, పాలకొల్లు బ్రాంచి**

అకౌంట్ నెంబర్ **520101264185724** **(IFSC Code : UBIN0827533)** నందు గాని చెల్లించగలరు. చందాను **బ్యాంక్ అకౌంట్‌లో జమచేసినవారు** జమచేసిన తేదీ, వారి అడ్రసును **9866715896** ఫోన్ నెంబరుకు తెలియపరచగలరు.

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

# మన గురువు ఎవరు?

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణముల నుండి సేకరణ)**

మమ్మల్ని గురువుగా ఎవరిని ఎన్నుకోమంటారు అని భగవాన్‌ను అడిగితే గురువు కోసం అందరినీ అడగక్కరలేదు, గురువుని ఎలా గుర్తించాలో, గురువు లక్షణాలు ఇక్కడ స్పష్టంగా చెపుతున్నారు:

☞ నీ మనస్సు ఎవరితో అయితే శృతి కలుపుతుందో, ఎవరి సమక్షంలో నువ్వు శాంతిలో తాండవాడుతావో, ఎవరి సన్నిధిలో నీ మనస్సు అణుగుతోందో,

☞ మీ మనోదేహముల తోటి సంబంధం లేకుండా ఎవరి మాట వచ్చి మీ హృదయానికి హత్తుకుంటోందో, నీ ప్రయత్నం తోటి సంబంధం లేకుండా, మీ సాధనతోటి సంబంధం లేకుండా ఎవరి దగ్గరైతే నువ్వు అభౌతికమైన ఆనందాన్ని, అలౌకికమైన ఆనందాన్ని పొందుతున్నావో,

☞ ఎవరి దగ్గర కూర్చుంటే నీకు ఓర్పు కలుగుతోందో, క్షమ కలుగుతోందో, ఎవరి దగ్గర కూర్చుంటే నీకు సహనం కలుగుతోందో, ప్రశాంతత కలుగుతోందో,

☞ సూదంటురాయి ఇనుముని ఆకర్షించినట్టుగా ఎవరి సమక్షంలో కూర్చుంటే నీ మనస్సు ఆకర్షింపబడుతోందో,

☞ ఎవరి చూపులో వెలుగు కనిపిస్తోందో, ఎవరి చూపులో రాగద్వేషాలు లేవో అది శవ చూపు కాదు శివ చూపు

☞ ఎవరి సమక్షంలో నీలోపల ఉన్నటువంటి సమానబుద్ధి, సమత్వబుద్ధి మేల్కొలప బడుతోందో, ఎవరి సమక్షంలో నీకు చెడు తగ్గిపోయి మంచి చెయ్యాలి అనే తలంపు మీకు కలుగుతోందో,

☞ ఇతరులను తెలుసుకోవటం కాదు, నన్ను నేను తెలుసుకోవాలి అనే బుద్ధి ఎవరి సమక్షంలో నీకు కలుగుతోందో

☞ ప్రకృతి గుణాలలోనుంచి బయట పడాలి, ఈ అజ్ఞాన నిద్రలో నుంచి బయటికి

రావాలి, అనేటువంటి సంకల్పాలు ఎవరి సమక్షంలో కలుగుతున్నాయో, నన్ను నేను తెలుసుకోవాలనే బుద్ధి నీకు కలుగుతోందో,

☞ ఎవరి సమక్షంలో విశ్వమంతా ప్రపంచమంతా గురువే అనే భావన కలుగుతుందో, అన్ని జీవరాసులలోను నీ గురువుని ఎప్పుడైతే నువ్వు చూడగలగుతున్నావో – వాడే నీ గురువు.!

నువ్వు ఎవరో నువ్వు తెలుసుకునే బుద్ధి నీకు కలగచేసి, నీ స్వరూపం దగ్గరికి తోలుకెళ్లేవాడు గురువు. నీ హృదయంలో ఉన్న సత్యాన్ని పట్టిచ్చేవాడు గురువు. నువ్వు ఎవడివో నువ్వు తెలుసుకోకుండా దేవుడిని తెలుసుకోవాలని ప్రయత్నం చేసినా నీకు దేవుడు తెలియబడదు. మనం ఎవరమో మనం తెలుసుకోవాలి, మనం బాగుపడాలి, చైతన్యస్థాయి పెంచుకోవాలి, గుణసంపద పెంచుకోవాలి. మనం ఏదైనా చేయగలిగితే లోక కల్యాణం కోసం చెయ్యాలి అనే సహృదయం, సద్బుద్ధి ఎవరి సమక్షంలో నీకు ఉదయిస్తుందో వాడే నీ గురువు. అమృతం మన హృదయంలో ఉంది. మృత్యువు ఎలా ఉంటుందో తెలియనటువంటి పదార్థం మన హృదయంలో ఉంది – అది నీకు గోచరింప చేస్తాడు. దేవుడు కనిపించి నీకు వరం ఇవ్వవచ్చు నువ్వు దానిని అనుభవించవచ్చు. అవి అన్నీ కూడా వ్యవహారిక సత్యాలు. నీ దేహం ఎంత నిజమో, మనస్సు ఎంత నిజమో అవి అన్నీ కూడా అంతే నిజం. అసలు పారమార్థిక సత్యానికి, ఈ కనిపించటానికి కనిపించక పోవటానికి ఏమీ సంబంధం లేదు. అందుచేత నిన్ను నువ్వు తెలుసుకోవటమే నిజమైన మహిమ, నిన్ను నువ్వు తెలుసుకోవటమే సత్యవిద్య, అదే ఆత్మవిద్య!

నేను ఇతరులను ఉద్ధరించేస్తున్నాను, వారికి జ్ఞానాన్ని భోదించేస్తున్నాను, లోకాన్ని ఉద్ధరించేస్తున్నాను అనే భావన అక్కడ ఉండదు. ఆటోమేటిక్‌గా పని జరుగుతూ ఉంటుంది. వాడే గురువు.

**నాకే గనుక అజ్ఞానం ఉంటే ఇతరులకు బోధించటానికి నా దగ్గర ఏమీ లేదు. నేనే గనుక జ్ఞానినైతే నాకు బోధించటానికి ఇతరులు ఎవరూ లేరు అనేవారు భగవాన్.**



ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

# గురువు

– అమ్మాజీగారు, విజయవాడ

గురువు అంటే ఆత్మ. గురువు అంటే చైతన్యం, గురువు అంటే పరబ్రహ్మం. మనము అనేక జన్మల నుండి భగవంతుడిని ఆరాధించగా ఆరాధించగా, ధ్యానించగా ధ్యానించగా, మోక్షానుభవం పొందాలని ప్రయత్నము చేస్తూ వుంటే భగవంతుడే ఒక రూపము ధరించి గురువుగా వచ్చి మనకు మార్గము చూపిస్తాడు. మనం ఈ భూమి మీదకు ఏ పని నిమిత్తము వచ్చామో, ఏది పొందితే తిరిగి ఈ భూమి మీదకు రానక్కరలేదో దాని గురించి బోధించి మనలను సరైన మార్గములో నడిపిస్తాడు. గురువు నోటి నుండి వచ్చిన మాటే దయ. ఆ మాటే జ్ఞానం, ఆ మాటల్లో ప్రేమ ఉంటుంది. ఆ దయకి, ప్రేమకు హద్దులు ఉండవు.

మన మాటలో, మన బుద్ధిలో వంకరలు ఉంటే ప్రకృతి మనుషులు మనలను విమర్శిస్తారు కానీ, వాటిని తొలగించలేరు. మరి గురువు అలా కాదు మన బుద్ధిలో వంకరలు ఉన్నాయని చెప్పదు, వాటిని తొలగించటానికే చూస్తాడు. బాహ్యమైన చీకటిని సూర్యుడు ఎలా పోగొడుతున్నాడో అలాగే మనలో ఉన్న అజ్ఞానమనే చీకటిని గురువు పోగొడతాడు.

శరీరానికి విశ్రాంతి కావాలి. మనస్సుకు విశ్రాంతి కావాలి, చైతన్యానికి విశ్రాంతి ఏమిటి? గురువు అంటే చైతన్యమే. మనం అజ్ఞానం అనే నిద్రలో ఉన్నాము. అందులో నుండి మనలను మేల్కొలపటానికి ఎక్కడ, ఎప్పుడు, ఏమి చేయాలి, అది ఎలా చేయాలి అనేది ఆయనే చూసుకుంటాడు. మనలో ఎంతో కొంత భక్తి ఉంటే దానిని పెంచటానికి, మనలో వ్యక్తిభావనని తగ్గించటానికి, అహంభావ రహితస్థితిని మనచేత పొందింపచేయటానికి ఈ కాలం, ఆ కాలం అనుకోకుండా ఎప్పుడూ మనకు సహాయ సహకారాలను అందిస్తూనే వుంటాడు. మనకు అర్హత ఉంటే, యోగ్యత ఉంటే, కేవలం మన ఒక్కరి కోసమైనా గురువు రూపము తీసుకొని వస్తాడు.

గురువుకు దేహమున్నా ఆయన 'దేహరహితుడు', నామమున్నా ఆయన 'నామరహితుడు'. అందుకే దేహము పోయినా గురువుతో ఉన్న అనుబంధం పోదు. మనకు అమృతానుభవం కలిగే వరకు జన్మ జన్మలకు మనలను వెంటాడుతాడు. మనం ఇంకొక జన్మలో వేరే శరీరం ధరించినా మనం ఎక్కడ జన్మించామో గురువు చూసుకుంటాడు. మన జీవలక్షణాల వల్ల ఆయనను మనము మర్చిపోయినా ఆయన మాత్రము మనని మర్చిపోడు. గురువు ఎక్కడ ఉన్నారో మనకు తెలియకపోయినా మనం ఎక్కడ ఉన్నామో గురువుకు తెలుసు. ఆయన ఏ స్థితిలో ఉన్నాడో ఆ స్థితికి మనలను తీసుకుని వెళ్ళటానికి అహర్నిశలు శ్రమిస్తూ ఉంటాడు. మనలను దారి తప్పకుండా ఆయనే చేయి పట్టుకొని హృదయగుహలోనికి తీసుకొనిపోతాడు. వాడు గురువు.

మన దేహయాత్ర స్మశానంతో ముగుస్తుంది, కానీ జీవుడి యాత్ర ముగియదు. అది జ్ఞానోదయం అయిన తరువాత మాత్రమే ముగుస్తుంది. గురువు అనుగ్రహం లేకుండా జ్ఞానోదయం కలుగదు. అగ్నికి వేడి ఎంత సహజమో గురువుకి దయ అంతే సహజంగా ఉంటుంది. ఆయన మీద భక్తి వలన, చలనం లేని విశ్వాసం వల్ల, శరణాగతి చెందడం వల్ల మాత్రమే గురువు దయ మనకు తెలుస్తుంది. గురువు చెప్పినది శ్రవణం చేయడం వల్ల, ఆయనకు సేవ చేయడం వల్ల మన జన్మకు కారణాలు, మన దుఃఖానికి కారణాలు తెలుస్తాయి. ఆ కారణాలు మనకు తెలియజేసి తరువాత వాటిని మనకు చూపించిన తరువాత ఆయన దయతో వాటిని కత్తిరించి తొలగిస్తాడు. అది ఆయన కృప. అప్పుడు మనకు దుఃఖంతోటి, జన్మతోటి ఉన్న అనుబంధము ఊడిపోతుంది. గురువు యొక్క అనుగ్రహానికి అసాధ్యం అంటూ ఏమీ లేదు. అంతా మౌనముగానే చేసేస్తాడు. ఆడంబరం ఏమీ ఉండదు.

మనము ఎన్ని తీర్థయాత్రలు చేసినా, గుడులు చుట్టూ తిరిగినా, పుణ్యనదులలో స్నానము చేసినా, ఎన్ని యోగాభ్యాసాలు చేసినా, ఎన్ని శాస్త్రాలు చదివినా, ఇవి అన్నీ గురువు

యొక్క సాన్నిధ్యంతోటి, అనుగ్రహంతోటి సరిపోవు. గురువు చేసే సహాయం మన కళ్ళకు కనబడదు, చెవులకు వినబడదు. గురువుకంటే మన క్షేమం కోరేవారు ఎవరూ ఉండరు. మనకు గురువే పెద్ద బంధువు, మన శ్రేయోభిలాషి, మన మిత్రుడు, మన దైవం, మన గతి, మన మార్గము, మన గమ్యము కూడా గురువే. మన సర్వస్వం గురువే. గురువు దగ్గర పొందిన శాంతి, ఆనందము ప్రపంచములో ఎక్కడా దొరకదు. ఆయన సమక్షంలో పొందిన శాంతికి, ఆనందానికి మనం ఏవిధంగానూ ఋణం తీర్చుకోలేము.

ప్రపంచ ఆకర్షణలలో మునిగి ఉన్న మన అందరి మనస్సులను ఆయన వైపు తిరిగేటట్లు చేసి జీవిత పరమార్ధాన్ని చిన్న చిన్న మాటలతో మనస్సుకు హత్తుకునేటట్లు భోదించారు. జనన, మరణ చక్రములో కొట్టుకు పోతున్న మనందరిని మోక్షమువైపు నడిపించటానికి కంకణం కట్టుకున్నారు మన గురువుగారు. ఈ దేహమే నిజం, ఈ లోకమే నిజం అని జీవిస్తున్న మనలను ఉద్ధరించటానికి వచ్చిన రమణాంశయే మన నాన్నగారు. కర్తృత్వ భావనతో జీవిస్తున్న మనకు కర్త ఈశ్వరుడు మాత్రమే అని, మనము నిమిత్తమాత్రం అని మన మనస్సులకు పట్టేవిధంగా ఉదాహరణలతో సహా భోదించారు. ఇప్పుడు మన జీవితంలో ఏది జరిగినా అది ఈశ్వరుడికి తెలియకుండా రావటం లేదు, ప్రారబ్ధాన్ని పాయసం తాగినట్లు అనుభవించమని మన గురువు భోదించారు. మనం అలా ఉండటానికి ప్రయత్నము చేస్తున్నాము అంటే అది గురువు అనుగ్రహానికి గుర్తు.

ఇలాంటి సద్గురువుని పొందిన మనందరి జీవితాలు ధన్యం. గురువుపట్ల కృతజ్ఞతాభావం, భక్తి విడిచిపెట్టకుండా గురువు చూపిన మార్గములో ప్రయాణిస్తూ, ఆయన మాటలను శ్రవణం చేస్తూ మననం చేసుకుంటూ, ఆచరణలో పెట్టుకొని అనుభవంలోనికి తెచ్చుకోవటానికి ప్రయత్నం చేద్దాము. ఆయన పాదాలను విడిచిపెట్టకుండా జీవిస్తూ, జీవితాన్ని సార్ధకము చేసుకోవడమే మన గురుదేవులకు ఇచ్చే గురుదక్షిణ.

సద్గురు శ్రీ నాన్నగారి దివ్య సన్నిధి



జిన్నూరు శ్రీ రమణ క్షేత్రం



# అమృతానుభవం

అప్పటి వేంకటరామన్, తరువాత కాలంలో భగవాన్ రమణమహర్షి తన 17వ ఏట మధురైలో ఉండగా అమృతానుభవాన్ని పొందారు. అదే ఆయనకు ఆత్మసాక్షాత్కారమైన శుభదినం. అమృతస్థితి అంటే మనస్సు మృతమైన స్థితి. అమృతానుభవం (లేదా) మరణానుభవం అంటే దేహానికి సంబంధించినది కాదు. దేహము జీవించి యుండగానే దేహాత్మబుద్ధి నుండి విడుదల పొంది, తాను అమరుడవటం. మానవుడు తన నిజతత్త్వాన్ని మరచిపోయి, పరమాత్మ కన్న భిన్నముగా తానొకవ్యక్తిని ఉన్నానని భావించడమే మృత్యువు. అనంతమైన పరమాత్మ నుండి మూలతలంపురీత్యా, దేహపరిమితిలో ఒక వ్యక్తిగా, జీవుడిగా వేరుపడడమే మృత్యువు. దేహాత్మబుద్ధి కారణంగానే మృత్యువు అనే మాట నిజమనిపిస్తుంది. "జాతస్య మరణం ధృవం" అన్నారు శ్రీకృష్ణపరమాత్మ; అది జనన–మరణ చక్రగతిని సూచిస్తుంది. పుట్టిన దానికే మరణం, పుట్టని దానికి మరణం వర్తించదు. పుట్టుక యొక్క గమ్యం మరణం. ఎప్పుడైతే పుట్టుకను అంగీకరించామో, అప్పుడే మరణం కూడా ప్రారంభమవుతుంది. అహంకార మరణమే నిజమైన మరణం. వేంకటరామన్ నిజంగానే తన 17వ ఏట మరణించాడు. భగవాన్ అనదగినదేదో అది ఆ శరీరంలో పూరించుకుంది. స్వరూప ఆత్మ అమృతము, కేవల ఉనికి, అది జనన మరణాలకు అతీతము. ఆత్మలోనే దేశ, కాలాలు జనన, మరణాలు నామ, రూపాలు అట్లే సకలమూ కల్పించబడ్డాయి. ఆత్మనైన నాకు పుట్టుకా లేదు, మరణమూ లేదు. మరణం అంటే ఏమిటో? దానిని అర్థం చేసుకోవాలి. మరణము అంటే భౌతిక శరీరం మరణించడం కాదు, దానిని ఎలాగూ తప్పించుకోలేము, అది అనివార్యము. అహంకారము నశించడమే నిజమైన మరణం. నశించే దేహాదుల ధర్మాలకు విరుద్ధమైనది ఆత్మధర్మం. దేహము నశిస్తుంది, ఆత్మ నశించదు. దేహము పుడుతుంది, ఆత్మ పుట్టదు. దేహము మరణిస్తుంది, ఆత్మ మరణించదు. దేహము వికారాలకు లోనవుతుంది, ఆత్మ నిర్వికారము. నేను అంటే ఆత్మ. జనన–మరణాలు కేవలం తలంపులే. దేహము చనిపోతే నిజముగా మనము చనిపోయినట్లు కాదు. నేను అనే ఆహంకారం, నాది అనే మమకారం నశిస్తే తప్ప మోక్షానుభవాన్ని పొందలేము. నేను ఎవరు అన్న విచారణతో దేహాత్మబుద్ధి నశించి, తాను ఆత్మేనన్న సత్యం అనుభవమవుతుంది. అదే అమరత్వం సిద్ధించడం. శరీరానికి మరణం ఆసన్నమయ్యేలోపు మరణ రహస్యం తెలియాలి. చైతన్యమే ఒక దేహమును, మనస్సును ధరించింది. పుట్టుక మరణము వంటి ద్వంద్వాలు, త్రిపుటి ఇత్యాదులన్నీ చైతన్యముపై ఆరోపించబడినవే. అమరత్వాన్ని పొందేందుకు ఈ మానవ శరీరము వరప్రసాదంగా లభించినది కావున, అమృతానుభవం పొందడమే మన పరమలక్ష్యం కావాలి.

(సద్గురు శ్రీనాన్నగారి చరణారవిందములకు నమస్కరిస్తూ...)

**(16-07-1896 భగవాన్ శ్రీరమణులు అమృతానుభవం పొందిన రోజును పురస్కరించుకొని)**

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**